గురువారం
THURSDAY
15-10-2026

జగిత్యాల JAGITIAL || పేజీలు:12 PAGES:12 || వెల రూ.2.00 PRICE: 2.00

సంపుటి: Volume:2 || సంచిక: Issue: 107

Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385

www.evarthalu.com

# నేటి ఈవార్తలు

EVARTHALU దినపత్రిక


అలిగిన బతుకమ్మ






## రైల్వే ఉద్యోగులకు 78 రోజుల బోనస్

న్యూఢిల్లీ: దసరా, దీపావళి పండగల సీజన్‌కు ముందు భారతీయ రైల్వే ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రైల్వే శాఖలోని నాన్-గెజిటెడ్ ఉద్యోగులకు 78 రోజుల వేతనానికి సమానమైన ఉత్పాదకత ఆధారిత బోనస్ ఇచ్చే ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా దాదాపు 11.40 లక్షల మంది ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు. ఈ బోనస్ రైల్వే శాఖలోని గ్రూప్-సి ఉద్యోగులకు వర్తిస్తుంది. వీరిలో ట్రాక్ మెయింటెనర్లు, లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్లు, స్టేషన్ మాస్టర్లు, సూపర్‌వైజర్లు, తరువాయి 2 వ పేజీలో...




## యూపీఐ ద్వారా పెన్షన్ ఖాతా

### భీమ్ యాప్‌లో సేవలు ప్రారంభం

న్యూఢిల్లీ: నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) ఖాతా తెరవాలనుకునే వారికి గుడ్‌న్యూస్. 'భీమ్' పేమెంట్స్ యాప్ ద్వారా కేవలం మూడు దశల్లోనే పెన్షన్ ఖాతా ప్రారంభించవచ్చు. 'నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా' (ఎన్‌పీసీఐ) అనుబంధ సంస్థ ఎన్‌పీసీఐ భీమ్ సర్వీసెస్ లిమిటెడ్ బుధవారం ఈ విషయాన్ని వెల్లడించింది. 'పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ తరువాయి 2 వ పేజీలో...




## ఐడీబీఐ.. విదేశీ పరం

### కెనడా కంపెనీ చేతిలోకి బ్యాంకు

### వాటా విక్రయానికి కేంద్రం ఆమోదం

### 60.72 శాతం వాటా ఫెయిర్‌ఫాక్స్‌కు

న్యూఢిల్లీ: ఐడీబీఐ బ్యాంకు ప్రైవేటీకరణ దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. బ్యాంకులో 60.72 శాతం వాటాను రూ.52,878 కోట్లకు కెనడాకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్ అనుబంధ సంస్థ '10955230 కెనడా ఇంక్'కు విక్రయించేందుకు కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపింది. ఈ ఒప్పందం పూర్తయితే ఎయిరిండియా తరువాయి 2 వ పేజీలో...



## కోల్.. గోల్‌మాల్

### కుంభకోణానికి రేవంత్ కుట్ర

### వాటాలు కుదరక కోమటిరెడ్డి బయటపెట్టిండు: కేటీఆర్

సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారమే ఎజెండాగా జీఆర్ఎస్.. కాంగ్రెస్ సర్కారుపై పోరాడుతుందని జీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గోదావరిఖనిలో నిర్వహించిన జీఆర్ఎస్ సింగరేణి కార్మిక గర్జన సభలో కేటీఆర్.. సీఎం రేవంత్ రెడ్డి టార్గెట్ గా విమర్శలు గుప్పించారు. సింగరేణిలో నైనీ కుంభకోణాన్ని అడ్డుకున్నట్లు మంత్రి కోమటిరెడ్డి చెప్పారని గుర్తుచేశారు.

గోదావరిఖని, అక్టోబర్ 14 (ఈవార్తలు): ఈ కుంభకోణాన్ని అడ్డుకోవడం వల్ల ప్రభుత్వానికి రూ.30 వేల కోట్లు మిగిలాయని తెలిపారు. రేవంత్ రెడ్డి మింగుదామనుకుంటే.. కోమటిరెడ్డి కాపాడారని చెప్పుకుంటున్నారు కానీ.. నిజానికి వారిద్దరి మధ్య వాటాలు కుదరక తరువాయి 2 వ పేజీలో...



## రేవంత్ ఉగ్రరూపం

### కరెంట్ కోతలపై అధికారులకు హెచ్చరిక.. పదేపదే చెప్పినా పరిస్థితి మారలేదని అసహనం

### స్పెషల్ సీఎస్, జెన్కో సీఎండీని సస్పెండ్ చేస్తా.. విద్యుత్తు సరఫరాపై సమీక్షలో సీఎం రేవంత్

తెలంగాణలో తరచూ తలెత్తుతున్న విదఎఎ39ఎఎ39త్ అంతరాయాలపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల పనితీరుపై ఆయన నిప్పులు చెరిగారు. ఎన్నిసార్లు ఆదేశాలు ఇచ్చినా పరిస్థితిలో మార్పు రాకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన సీఎం, అధికారులు తమ తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని, ఉన్నతస్థాయి అధికారులను సస్పెండ్ చేయడానికి కూడా వెనుకాడబోనని గట్టి హెచ్చరిక జారీ చేశారు. బుధవారం విద్యుత్ సరఫరా పరిస్థితిపై సమీక్షించిన సీఎం రేవంత్ రెడ్డి, అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డారు.

హైదరాబాద్, అక్టోబర్ 14 (ఈవార్తలు): భవిష్యత్తులో విద్యుత్ కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నప్పటికీ, ఉత్పత్తిని పెంచేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నైనీ, మహానది నుంచి బొగ్గు సరఫరాకు పూర్తిస్థాయిలో లింకేజీలు ఉన్నప్పటికీ, విద్యుత్ ఉత్పత్తి ఆశించిన స్థాయిలో ఎందుకు జరగడం లేదని నిలదీశారు. "పదేపదే చెప్పినా తరువాయి 2 వ పేజీలో...



## పాలమూరు ద్రోహి

### మళ్లీ వలసలు మొదలైనయ్.. మాజీమంత్రి హరీశ్ రావు ఫైర్

సీఎం రేవంత్ రెడ్డి పాలమూరు ద్రోహి అని మాజీమంత్రి హరీశ్ రావు ఆరోపించారు. కేసీఆర్ ఎప్పుడో చెప్పారు.. కాంగ్రెసోళ్లు గెలిస్తే రైతు బంధుకు రాం రాం.. దళిత బంధుకు జై భీమ్.. అయిందా మరి ఇప్పుడు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. గద్వాల రైతుల సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. మూడు పంటలకు రైతు బంధు ఎగ్గొట్టిండు. రైతు బీమా బంద్ పెట్టిండు. 24 గంటల కరెంట్ 7 గంటలకు వచ్చేసింది.. కళ్యాణ లక్ష్మి పిల్లలు పుట్టినంక వస్తుంది.. కేసీఆర్ ఉన్నప్పుడు కల్యాణలక్ష్మి పెళ్లికి వచ్చింది.. రేవంత్ రెడ్డి వచ్చినంక పిల్లలు పుట్టిన తర్వాత వచ్చింది. తులం బంగారం ఇస్తమన్నరు.. ఉత్తదైపోయిందా.. లేదా..? అని ఎద్దేవా చేశారు.

గద్వాల, అక్టోబర్ 14 (ఈవార్తలు): 'రేవంత్ రెడ్డి పాలమూరు ద్రోహి. ఇయ్యాళ పాలమూరు బిడ్డ అని చెప్పుకునే అర్హత రేవంత్ రెడ్డికి లేదు. ఎందుకంటే నువ్వు పాలమూరు ఎత్తిపోతలను పండబెట్టినవ్.. నీళ్లు ఇయ్యలేదు. మళ్లీ పాలమూరు జిల్లాలో వలసలు మొదలైనయి. ముఖ్యంగా బీఆర్ఎస్ కార్యకర్తలకు వచ్చే మాట ఒక్కటే. తరువాయి 2 వ పేజీలో...


## బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,826 |
| వెండి (కిలో): | రూ.2,45,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,063 |

## విశ్వవాణి



మన శరీరంలో సుమారు 24 గంటల చక్రం ప్రకారం పనిచేసే అంతర్గత గడియారం ఉంటుంది. దీన్నే జీవ గడియారం అంటారు. నిద్ర, హార్మోన్ల విడుదల, శరీర ఉష్ణోగ్రత, జీవక్రియలు సహా అనేక ప్రక్రియలను ఇది సమన్వయం చేస్తుంది. ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రపోవడం, మేల్కొనడం వల్ల ఈ గడియారం పగలు, రాత్రి మార్పులకు అనుగుణంగా పనిచేస్తుంది. రోజుకో సమయానికి నిద్రపోవడం, మేల్కొనే సమయాల్లో పెద్దగా మార్పులు రావడం వల్ల శరీర అంతర్గత గడియారం, నిద్ర వేళల మధ్య సమన్వయం దెబ్బతినవచ్చు. దీనివల్ల హార్మోన్ల ఉత్పత్తి, జీవక్రియలు, మెదడు పనితీరుపై ప్రభావం పడే అవకాశం ఉంది.



## ఏపీ 'స్థానిక' షెడ్యూల్ రిలీజ్

### మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు

విజయవాడ, అక్టోబర్ 14 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా బుధవారం విజయవాడలో ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు తరువాయి 2 వ పేజీలో...

## దివ్యాంగులకు పుట్టుకతోనే పెన్షన్

### 40 శాతం వైకల్యం ఉంటే పింఛనుకు అర్హత

### కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం

దివ్యాంగుల పింఛన్లకు సంబంధించి బుధవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. రూ.53,428 కోట్లతో ' ప్రధానమంత్రి సామాజిక సహాయత యోజన ' పథకానికి ఆమోదం తెలిపారు.



న్యూఢిల్లీ: 'జాతీయ సామాజిక సహాయ పథకం.. దాని అనుబంధ పథకాల పేర్ల మార్పు, దివ్యాంగుల పెన్షనుకు సంబంధించి అర్హత ప్రమాణాలు, లబ్ధిదారుల పరిధి, అందించే సహాయం మొత్తం సవరింపు, వృద్ధులు, వితంతువుల పింఛన్ పథకాలతో పాటు కుటుంబ ప్రయోజన పథకాన్నీ ప్రస్తుతం ఉన్న రూపంలోనే కొనసాగించనున్నారు. ఇప్పటి వరకు ఉన్న నిబంధనలను కూడా సడలించారు. ప్రస్తుతం 80 శాతం వైకల్యం ఉన్నవారికే దివ్యాంగుల పెన్షన్ అందిస్తున్నారు. తాజాగా, దీనిని 40 శాతానికి తగ్గించారు. అలాగే, 18 ఏళ్ల కనీస వయోపరిమితిని కూడా తొలగించారు. పుట్టినప్పటి నుంచే అర్హులైన దివ్యాంగులకు పెన్షన్ అందజేయనున్నారు. అంతేకాదు, దివ్యాంగుల తరువాయి 2 వ పేజీలో...




## కాక్రోచ్‌లకు అమెరికా నిధులు

### యూఎస్ గాయని మేరీ మిల్‌బెన్ ఆరోపణ

న్యూఢిల్లీ: ఇండియాలోని కాక్రోచ్ జనతా పార్టీకి అమెరికాలో ఉన్న దాతలు భారీగా విరాళాలు అందిస్తున్నట్లు అమెరికా గాయని మేరీ మిల్‌బెన్ ఆరోపించారు. సైలెంట్‌గా ఉండాల్సిన సమయం ఇది కాదు అని, విచ్ఛిన్నకర స్ఫూర్తిని ధీకొట్టేందుకు దేశంలోని యువత శాంతియుత నిరసన చేపట్టాలని ఆమె పిలుపునిచ్చారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ విపక్షాలతో పాటు సీజేపీ నేతలు తరువాయి 2 వ పేజీలో...

## మీ ఫోన్‌లో మీరే యాప్ క్రియేటర్

### ప్లే స్టోర్‌లో గూగుల్ అదిరిపోయే మార్పులు




న్యూఢిల్లీ: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో ఎవరికి కావాల్సిన ఆండ్రాయిడ్ యాప్‌లను వారే రూపొందించుకునే సదుపాయాన్ని గూగుల్ తీసుకొచ్చింది. ఇందుకోసం ప్రత్యేకంగా డెవలపర్ అకౌంట్ తెరవాల్సిన అవసరం లేదు. సాధారణ అకౌంట్‌తోనే ఏఐ టూల్స్, సహజ భాషలో ఇచ్చే సూచనల ద్వారా యాప్‌లను తయారు చేసి సొంత ఫోన్‌లో ఉపయోగించుకోవచ్చు. మంగళవారం ఈ కొత్త ఫీచర్లను గూగుల్ ప్రకటించింది. గూగుల్ ఏఐ స్టూడియో సాయంతో రూపొందించే ఈ యాప్‌లను ప్రస్తుతానికి సొంత పరికరాల్లో మాత్రమే ఉపయోగించుకోవచ్చు. ఇవి ప్లే స్టోర్‌లో అందరికీ కనిపించే యాప్‌లకు వేరుగా ఉంటాయి. త్వరలో స్నేహితులు, కుటుంబ సభ్యులతోనూ వీటిని పంచుకునే అవకాశం కల్పించనుంది. తరువాయి 2 వ పేజీలో...



## రైళ్లలో స్పీకర్ ఆన్ చేసి మొబైల్ చూస్తే 1,000 ఫైన్

న్యూఢిల్లీ: రైలు ప్రయాణంలో ఇటీవల తోటి ప్రయాణికుల నుంచి పెరిగిపోతున్న శబ్దకాలుష్యం నివారణకు రైల్వే శాఖ గట్టి చర్యలు చేపట్టనుంది. ఇకపై రైలులో ప్రయాణించే టప్పుడు మొబైల్ స్పీకర్ ఆన్ చేసి పాటలు వినడం, వీడియోలు చూడటం లేదా ఫోన్‌లో గట్టిగా మాట్లాడటం నిషేధం. అలాంటివారిపై సదరన్ రైల్వే కఠిన చర్యలు చేపడుతుంది. తోటి ప్రయాణికులకు తరువాయి 2 వ పేజీలో...

## బ్లూ డ్రమ్ మర్డర్ కేసు..

### నిందితులకు ఉరిశిక్ష.. మీరట్ కోర్టు కీలక తీర్పు



మీరట్: దేశంలో సంచలనం సృష్టించిన మీరట్, బ్లూడ్రమ్ మర్డర్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. నిందితులు ఇద్దరికీ మరణశిక్ష విధిస్తూ మీరట్‌కు చెందిన జిల్లా కోర్టు బుధవారం తీర్పు వెల్లడించింది. ఈ మేరకు జిల్లా కోర్టు జడ్జి అరవింద్ కుమార్ మిశ్రా తీర్పు వెలువరించారు. ఈ కేసు విచారణ గత సెప్టెంబర్ 30న పూర్తికాగా.. నిందితులు ముస్కాన్ రస్తోగి, ఆమె ప్రియుడు సాహిల్ శుక్లా నేరానికి పాల్పడ్డట్లు తేలింది. దీంతో ఆరోజు తీర్పు రిజర్వ్ చేయగా, నేడు తీర్పు వెల్లడించారు. ఈ ఘటనలో హత్యకు గురైంది రస్తోగి భర్త సౌరభ్ భరద్వాజ్. తీర్పు వెలువడుతున్న సమయంలో జిల్లా జైలులో ఉన్న నిందితులు ఇద్దరూ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరయ్యారు. బ్లూ డ్రమ్ హత్యకు సంబంధించిన పూర్తి వివరాలివి. ఉత్తర ప్రదేశ్, మీరట్‌కు చెందిన నేవీ మాజీ తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు

15.10.2026

మేషం: మాతృ సంబంధిత అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. రావలసిన ధనం చేతికి అందడంలో ఆలస్యం అవుతుంది. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు వాయిదా వేస్తారు. వ్యాపార విస్తరణ ప్రయత్నాలలో అవరోధాలు కలుగుతాయి. ఉద్యోగస్తులకు అధికారులతో చర్చలు ఫలించవు.

వృషభం: చేపట్టిన పనులలో జాప్యం కలిగినా నిదానంగా పూర్తి చేస్తారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. సంతాన విద్యా విషయాలపై దృష్టి సారించడం మంచిది. ధన వ్యవహారాలలో ఆశించిన ఫలితాలు ఉంటాయి. వృత్తి, వ్యాపారాలలో సోదరుల సహాయ సహకారాలు అందుతాయి.

మిథునం: వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. గృహమున కొందరు మాటలు మానసికంగా చికాకు పరుస్తాయి. ప్రయాణాలు వాయిదా పడతాయి. వృత్తి ఉద్యోగాలలో అదనపు పనిభారం ఉంటుంది. గృహ నిర్మాణ పనులు మందకొడిగా సాగుతాయి. బందు మిత్రులతో మాటపట్టింపులు ఉంటాయి.

కర్కాటకం: దూరప్రయాణాలు లాభదాయకంగా సాగుతాయి. చేపట్టిన పనుల్లో శ్రమకు తగిన ఫలితం పొందుతారు. వ్యాపారాలలో ఆశించిన ఫలితాలు పొందుతారు. ఉద్యోగమున అధికారుల అనుగ్రహం పొందుతారు. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి.

సింహం: ఉద్యోగమున అదనపు పని ఒత్తిడి వలన తగిన విశ్రాంతి ఉండదు. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. ఇతరుల వ్యవహారాల్లో జోక్యం చేసుకోకపోవడం మంచిది. ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు చేయవలసి వస్తుంది.

కన్య: కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు. గృహ నిర్మాణ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. ఉద్యోగమున అనుకూల వాతావరణం ఉంటుంది. పదోన్నతులు పెరుగుతాయి. గృహమున సంతాన వివాహ విషయమైన ప్రస్తావన వస్తుంది. కొన్ని రంగాల వారికి అనుకూల ఫలితాలు ఉంటాయి.

తుల: నిరుద్యోగులకు కొంత కష్టం మీద నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. వృత్తి, ఉద్యోగాలలో ఓర్పుతో వ్యవహరించాలి. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు కార్యరూపం దాలుస్తాయి. ఇతరులపై మీ అభిప్రాయం మార్చుకోవడం మంచిది.

వృశ్చికం: కుటుంబ సభ్యుల మధ్య అవగాహన లోపించి మనస్పర్ధలు కలుగుతాయి. నిరుద్యోగుల ప్రయత్నాలు నత్తనడకన సాగుతాయి. చిన్ననాటి మిత్రులతో కొన్ని విషయాల గురించి చర్చిస్తారు. చేపట్టిన పనులలో ఆటంకాలు ఉంటాయి. వృత్తి వ్యాపారాలలో స్వల్ప లాభాలు అందుకుంటారు.

ధనస్సు: ఉద్యోగమున సహోద్యోగులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలున్నవి. దాయాదులతో స్థిరాస్తి తగాదాలు ఉంటాయి. సంతానం విద్యా విషయాలు నిరుత్సాహపరుస్తాయి. దైవ సేవా కార్యక్రమాల పట్ల ఆశక్తి పెరుగుతుంది.

మకరం: భూ క్రయ విక్రయాలు నిరుత్సాహపరుస్తాయి. జీవిత భాగస్వామి ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించాలి. ఒక వ్యవహారంలో సోదరులతో విభేదిస్తారు. ఉద్యోగాల్లో ఇతరుల నుండి విమర్శలు తప్పవు. వృధా ఖర్చులను అదుపులో పెట్టుకోవాలి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తికావు.

కుంభం: సంఘంలో విశేషమైన ఆదరణ పెరుగుతుంది. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో సఖ్యతగా వ్యవహరించి పనులు పూర్తిచేస్తారు. నిరుద్యోగ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. ఇతరుల సహాయ సహకారాలతో కొన్ని పనులు పూర్తి చేస్తారు.

మీనం: భూ సంభందిత వ్యవహారాలలో తగాదాలు చికాకు పరుస్తాయి. సంతానంతో మాట పట్టింపులుంటాయి. వృత్తి ఉద్యోగాలలో మిశ్రమ ఫలితాలుంటాయి. దైవ సేవా కార్యక్రమాలకు ధన సహాయం అందిస్తారు. ఆర్థిక లావాదేవీలు సామాన్యంగా సాగుతాయి. వ్యాపారాలలో భాగస్తులు నుండి ఒత్తిడి పెరుగుతుంది.

# కోల్.. గోల్‌మాల్

మొదటి పేజీ తరువాయి

కుంభకోణాలను వారే బయటపెట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. నైనీ స్కామ్ అనగానే వాటాలు కుదరక టెండర్లను రద్దు చేశారని, సైట్ విజిట్ సర్టిఫికెట్ రూల్ పేరిటే రూ.10 వేలకోట్ల స్కామ్ జరిగిందన్నారు. ఇలా.. సోలార్, జిలెటిన్ స్టిక్స్ తో పాటు మరో నాలుగైదు స్కాములు జరిగాయన్నారు. ఈ స్కాములపై అన్ని ఆధారాలతో కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాశామని, గవర్నర్ ను కూడా కలిశామని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని సైట్ విజిటేషన్ అనే కుంభకోణం తెలంగాణలోనే జరిగిందని కేటీఆర్ ఆరోపించారు. కోల్ మాల్ ను గోల్ మాల్ చేస్తున్నది ఎవరు? సింగరేణిని అవినీతి గనిగా మారుస్తున్నది ఎవరు? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ దిగిపోయేనాటికి సింగరేణి బొగ్గు ఉత్పత్తి 70 మిలియన్ టన్నులుగా ఉన్నదని, కాంగ్రెస్ హయాంలో అది 58 మిలియన్ టన్నులకు పడిపోయిందన్నారు. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి తగ్గడానికి కారణం కార్మికులు కాదని, ప్రభుత్వ వైఫల్యం, అవినీతే ప్రధాన కారణాలన్నారు. సింగరేణిలో ఇప్పుడు అవినీతి రైజింగ్.. ఉత్పత్తి ఫాలింగ్ గా ఉందన్నారు. పోరాటాల పురిటిగడ్డ రామగుండమని, చీకటి గుహల్లో రక్తతర్పణ చేసిన చరిత్ర సింగరేణి కార్మికులదని పేర్కొన్నారు. '

### మాస్ లుక్‌లో కేటీఆర్

'వచ్చేటప్పుడు కరీంనగర్‌లో హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీశ్ బాబు ఆపితే అక్కడ కొద్దిసేపు ఆగిన. ఏం సంగతి ఏమో గడ్డం పెంచినవ్ అని అడిగిండు.



పోయేదెక్కడికి గోదావరి ఖనికి.. ఆ మాత్రం ఉండాలే కదా అని చెప్పిన. పోయేది సింగరేణికి కదా ఆ మాత్రం ఉండాలే.. లేకపోతే నడువదు అని చెప్పిన' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గోదావరి ఖని సింగరేణి స్టేడియంలో 'సింగరేణి కార్మిక గర్జన'లో కేటీఆర్ మాట్లాడుతూ.. పోరాటాల పురిటి గడ్డ రామగుండం అంటేనే రణగర్జన చేసే రణరంగం ఈ గడ్డ. నల్లబంగారు గనుల నుంచి తరలివచ్చిన మా కార్మిక అన్నలందరికీ హృదయపూర్వక వందనం. చెమట, నెత్తురు దారపోసి ఈ దేశానికి విద్యుత్ అందించి వెలుగులు ప్రసరించే విధంగా కష్టపడుతున్న ప్రతీ కార్మిక సోదరుడికి హృదయపూర్వకంగా శిరస్సు వంచి ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు.



## పాలమూరు ద్రోహి

మొదటి పేజీ తరువాయి

నిరంజనన్న మీకు అండగా ఉన్నరు.. హనుమంతు అద్భుతంగా పనిచేస్తున్నడు. కేశవ్ ఉండనే ఉన్నరు.. అలంపూర్ ఎమ్మెల్యే మీ పక్కనే ఉన్నరు. ఏ ఆపద వచ్చినా మీకు ఎమ్మెల్యే తయారుగా ఉండనే ఉన్నడు. ఒక్క ఏడాది ఏడాదిన్నర కష్టపడండి. మీ అందరినీ కాపాడుకునే బాధ్యత మాది. ఏ కార్యకర్తకు ఇబ్బంది వచ్చినా మేమంతా మీకు అండగా ఉంటాం. మిమ్మల్నందరినీ కాపాడుకునే బాధ్యత మాది.. కచ్చితంగా గద్వాల్‌లో మీ అందరు కోరుకున్న నాయకుడినే ఎమ్మెల్యేగా ఎన్నుకుందాం.. దగ్గరుండి గెలిపించుకుందాం. తప్పకుండా మీ అందరి కష్టాలు తీర్చే బాధ్యత మన బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ నాయకత్వంలో తీసుకుందాం' అని అన్నారు.

## రేవంత్ ఉగ్రరూపం

మొదటి పేజీ తరువాయి



మీలో చలనం రావడం లేదు. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే చూస్తూ ఊరుకోవాలా? ఇదే నిర్లక్ష్యం కొనసాగితే ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (స్పెషల్ చీఫ్ సెక్రటరీ), జెన్‌కో సీఎండీ సహా ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు" అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. విద్యుత్ కోతలకు గల కారణాలపై తక్షణమే నివేదిక ఇవ్వాలని, సరఫరాను సాధారణ స్థితికి తెచ్చేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. అంతకుముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) మేయర్ల ప్రతినిధి బృందం కలిసింది. ఈ సమావేశంలో తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా హెల్త్‌కేర్, డిజిటల్ టెక్నాలజీ, రక్షణ, ఏరోస్పేస్, టెక్స్‌టైల్స్, పరిశోధన, తయారీ రంగాల్లో పెట్టుబడులకు గల అవకాశాలను సీఎం వారికి వివరించారు. రాష్ట్రంలో నైపుణ్యం కలిగిన మానవ వనరులు, వ్యాపార అనుకూల వాతావరణం ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా "యూకే-ఇండియా సీఈటీఏ అండ్ రీజనల్ సినర్జీస్" అనే అంశంపై యూకే-ఇండియా బిజినెస్ కౌన్సిల్ రూపొందించిన నివేదికను సీఎం ఆవిష్కరించారు. అనంతరం, డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న "ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026"కు హాజరు కావాల్సిందిగా యూకే ప్రతినిధులను ఆయన సాదరంగా ఆహ్వానించారు.

## కాక్రోచ్‌లకు అమెరికా నిధులు

మొదటి పేజీ తరువాయి

ఆందోళన చేస్తున్న నేపథ్యంలో మిల్‌బెన్ ఈ వ్యాఖ్యలు చేశారు. సీజేపీ నేత అభిజీత్ దీప్కేతో పాటు అతని పార్టీకి అమెరికన్లు విరాళాలు ఇస్తున్నారని, ప్రధాని మోదీకి వ్యతిరేకంగా ఆ విరాళాలను అందిస్తున్నారని అమెరికన్ సింగర్ మిల్‌బెన్ తెలిపారు. ఇప్పుడు మౌనంగా ఉండాల్సిన సమయం కాదు అని, అందమైన దేశ యువత శాంతియుత రీతిలో విచ్ఛిన్నకర శక్తులతో పోరాడాలన్నారు. యువ దేశభక్తులారా, భయం వద్దు, మీ ప్రధాని.. భారత్‌కు 25 ఏళ్లు సేవ చేశారని, 12 ఏళ్లు ప్రధానిగా వరుసగా మూడుసార్లు ఎన్నికయ్యారని, విచ్ఛిన్నకర శక్తులకు ఆయన తలొగ్గరన్నారు. ప్రపంచవ్యాప్తంగా దాతలకు ఓ ప్రత్యేక విధానం ఉంటుందని, ఎక్కడైనా కన్జర్వేటివ్ నేతల్ని టార్గెట్ చేస్తారని, అమెరికాలో చదువుకున్న వ్యక్తులను గుర్తించి, వారిని ర్యాడికలైజ్ చేసి, ఆయా దేశాలకు పంపిస్తారని, ఇక గందరగోళం, విధ్వంసం సృష్టించేందుకు ఫండింగ్ చేస్తారని, కానీ ఇప్పటి వరకు ఎవరూ సక్సెస్ కాలేదని, కానీ వాళ్లు అభివృద్ధికి, పరిపాలనకు అడ్డుపడుతుంటారని మిల్‌బెన్ తెలిపారు. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛను ఉన్నతంగా నిలిపేందుకు కౌంటర్‌గా ఓ ఉద్యమం అవసరం అవుతుందని అమెరికన్ సింగర్ అభిప్రాయపడ్డారు. భారత్‌లో కొత్త గళం ఉద్భవించాలని, ఈనేలలో చదివిన వ్యక్తులు ముందుకు రావాలని, కాక్రోచ్ జనతా పార్టీ విచ్ఛిన్నర స్ఫూర్తిని శాంతియుతంగా దెబ్బతీయాలని, దీని కోసం ఈ దేశ యువత మేలుకోవాలని ఆమె అన్నారు. ఆఫ్రికన్-అమెరికన్ హాలీవుడ్ నటి, గాయని అయిన మిలిబెన్ ఇటీవల ఇండియాలో ఫేమస్ అయ్యారు. భారత జాతీయ గీతంతో పాటు ఓం జై జగదీశ హరే పాటలను ఆమె పాడారు. 2023లో ప్రధాని మోదీ అమెరికాలో టూర్ చేసినప్పుడు ఆ కార్యక్రమంలో మిలిబెన్ జనగణమణ పాడారు.

## బ్లూ డ్రమ్ మర్డర్ కేసు..

మొదటి పేజీ తరువాయి

అధికారి సౌరభ్ రాజ్‌పుత్.. 2025, మార్చి 3న హత్యకు గురయ్యాడు. అతడి భార్య ముస్కాన్ రస్తోగి, ఆమె ప్రియుడు సాహిల్ శుక్లా కలిసి సౌరభ్‌ను హత్య చేశారు. తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో సౌరభ్‌ను హత్య చేశారు. అనంతరం అతడి మృతదేహాన్ని ముక్కలుగా చేసి, ఒక బ్లూ డ్రమ్‌లో ఉంచారు. పైనుంచి సిమెంట్ పోసి, కప్పేశారు. దీంతో అతడి మృతదేహం అందులోనే కూరుకుపోయింది. ఘటన జరిగిన కొన్ని రోజులకు పోలీసులు అన్ని కోణాల్లో విచారించగా ఈ హత్య ఘటన బయటపడింది. సౌరభ్‌ను ముస్కాన్, ఆమె క్లాస్‌మేట్, ప్రియుడు సాహిల్ కలిసి హత్య చేసినట్లు తేలింది. దీనిపై గత ఏడాది జూలైలో విచారణ ప్రారంభమైంది. మొత్తం 13 నెలల్లోనే ఈ కేసు విచారణ పూర్తై, తీర్పు వెలువడటం విశేషం. ఈ కేసులో 126 వాదోపవాదాలు జరిగాయి. 22 మందికిపైగా సాక్షుల్ని కోర్టు విచారించి, చార్జిషీటు దాఖలు చేసింది. దీనిపై ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరం తీర్పు వెలువడింది.

## దివ్యాంగులకు పుట్టుకతోనే పెన్షన్

మొదటి పేజీ తరువాయి

కేంద్ర పెన్షన్ సహాయం 25% పెంచింది. ఈ నిర్ణయంతో అదనంగా 19.15 లక్షల మంది దివ్యాంగులకు లబ్ధి కలుగుతుంది. ప్రస్తుతం 3 కోట్లుగా లబ్ధిదారుల సంఖ్య 3.2 కోట్లకు పెరగనుంది. ఈ మేరకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. వైకల్య శాతం తగ్గించడం వల్ల లబ్ధిదారుల సంఖ్య పెరుగుతుందని, దీనివల్ల వారికి సామాజిక భద్రత లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం.. ప్రధానమంత్రి సామాజిక సహాయత యోజనగా మారింది. అలాగే, ఇందిరా గాంధీ జాతీయ వృద్ధాప్య పింఛను పథకం ప్రధానమంత్రి వృద్ధావస్థ పెన్షన్ యోజనగా.. ఇందిరా గాంధీ జాతీయ వితంతు పింఛను పథకం.. ప్రధానమంత్రి విధవా పెన్షన్ యోజనగా.. ఇందిరా గాంధీ జాతీయ దివ్యాంగుల పింఛను పథకం.. ప్రధానమంత్రి దివ్యాంగజన్ పెన్షన్ యోజనగా.. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం.. ప్రధానమంత్రి పరివార్ లాభ్ యోజనగా పేరు మార్చారు. దివ్యాంగ పెన్షన్ పథకం కింద, 0-79 ఏళ్ల వయస్సు మధ్య వారికి ఇకపై రూ.375... 80 ఏళ్లు, ఆపై వారికి రూ.625కి పెంచారు.

## రైల్వే ఉద్యోగులకు 78 రోజుల బోనస్

మొదటి పేజీ తరువాయి

టెక్నీషియన్లు, టెక్నీషియన్ హెల్పర్లు, పాయింట్స్‌మెన్ వంటి కీలక సిబ్బంది ఉన్నారు. రైల్వేలలో వీరి పాత్రను గుర్తిస్తూ ప్రభుత్వం ఈ ప్రోత్సాహకాన్ని ప్రకటించింది. బోనస్‌ను 78 రోజుల వేతనంగా లెక్కించినప్పటికీ, చెల్లింపుల పరిమితుల ప్రకారం ప్రతి ఉద్యోగికి గరిష్ఠంగా రూ.17,951 మాత్రమే అందుతుంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రైల్వేల పనితీరును పరిగణనలోకి తీసుకుని ఈ బోనస్‌ను ఖరారు చేశారు. ఆ ఆర్థిక సంవత్సరంలో భారతీయ రైల్వేస్ రికార్డు స్థాయిలో 1,670 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేయడంతో పాటు, సుమారు 741 కోట్ల మంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చింది. ఉద్యోగుల అంకితభావం, కృషిని గుర్తించి వారిలో స్ఫూర్తిని నింపేందుకే ఈ బోనస్‌ను అందిస్తున్నట్లు రైల్వే మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. మెరుగైన పనితీరు కనబరిచేలా సిబ్బందిని ప్రోత్సహించడం దీని ముఖ్య ఉద్దేశమని పేర్కొంది.

## ఐడీబీఐ.. విదేశీ పరం

మొదటి పేజీ తరువాయి

విక్రయం తర్వాత దేశంలోనే అతిపెద్ద వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణగా నిలవనుంది. ఐడీబీఐ బ్యాంకులో కేంద్ర ప్రభుత్వానికి ఉన్న 30.48 శాతం వాటా, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కి ఉన్న 30.24 శాతం వాటా కలిపి మొత్తం 60.72 శాతాన్ని ఫెయిర్‌ఫాక్స్ కొనుగోలు చేయ నుంది. ఒక్కో షేరుకు రూ.81 చొప్పున ఈ బిడ్ దక్కించుకుంది. మొత్తం కొనుగోలు విలువ రూ.52,877.07 కోట్లుగా ప్రభుత్వం అధికారిక ప్రకటనలో వెల్లడించింది. ఈ ఒప్పందం పూర్తయితే భారత ఆర్థిక రంగంలో ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ)గా నిలుస్తుందని కేంద్రం పేర్కొంది. ఐడీబీఐ బ్యాంకులో యాజమాన్య నియంత్రణను ప్రైవేటు సంస్థకు బదిలీ చేయాలన్న కేంద్ర ప్రభుత్వ దీర్ఘకాలిక ప్రణాళిక ఈ నిర్ణయంతో ముందుకు సాగనుంది. అయితే, ఈ లావాదేవీ పూర్తవడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అనుమతి కీలకం కానుంది. బ్యాంకును సొంతం చేసుకుని నిర్వహించేందుకు ఫెయిర్‌ఫాక్స్ అర్హతలను ఆర్‌బీఐ పరిశీలించనుంది. ఇందులో భాగంగా సంస్థపై 'ఫిట్ అండ్ ప్రాపర్' అంచనా వేయనుంది. ఫెయిర్‌ఫాక్స్‌కు ఇప్పటికే సీఎస్‌బీ బ్యాంకులో వాటా ఉంది. నిబంధనల ప్రకారం ఐడీబీఐ బ్యాంకు కొనుగోలు పూర్తయిన రెండేళ్లలోగా సీఎస్‌బీ బ్యాంకును ఐడీబీఐలో విలీనం చేయాలి లేదా సీఎస్‌బీ బ్యాంకులో తన వాటాను విక్రయించి బయటకు రావాలి. అలాగే ఐడీబీఐ బ్యాంకులోని మైనారిటీ వాటాదారుల కోసం ఫెయిర్‌ఫాక్స్ ఓపెన్ ఆఫర్ కూడా ప్రకటించాల్సి ఉంటుంది. ఈ ఒప్పందం తర్వాత కూడా కేంద్ర ప్రభుత్వం, ఎల్ఐసీ ఐడీబీఐ బ్యాంకులో కొంత వాటాను కొనసాగించనున్నాయి. రాబోయే రెండేళ్లలో ఎల్ఐసీ వాటా 19 శాతం నుంచి 15 శాతానికి తగ్గే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వ మిగిలిన వాటాను బహిరంగ మార్కెట్ ద్వారా విక్రయించనున్నారు. ఈ లావాదేవీని వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణగా కాకుండా 'వ్యూహాత్మక పునర్వ్యవస్థీకరణ'గా పరిగణించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అభివర్ణించారు. బ్యాంకులో కేంద్రం, ఎల్ఐసీ వాటాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా ఈ ఒప్పందాన్ని పూర్తి చేయనున్నట్లు పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ విభాగం (దీపం) కార్యదర్శి అరుణీష్ చావ్లా పీటీఐ వార్తా సంస్థకు తెలిపారు.

## రైళ్లలో స్పీకర్ ఆన్ చేసి మొబైల్ చూస్తే 1,000 ఫైన్

మొదటి పేజీ తరువాయి

ఇబ్బంది కలిగించేలా పెద్ద సౌండ్‌తో పాటలు విన్నా, వీడియోలు చూసినా రూ.1,000 ఫైన్ వేస్తారు. హెచ్చరిక చేసినా వినకపోతే 6 నెలల వరకు జైలు శిక్ష, రూ.5,000 వరకు జరిమానా పడే అవకాశం ఉంది. ఇండియన్ రైల్వేస్ యాక్ట్ కింద ఈ చర్యలు తీసుకుంటున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైల్వేస్టేషన్లలో కూడా ఈ రూల్స్ వర్తిస్తాయి. ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు పెరగడంతో రైల్వే ఈ నిర్ణయం తీసుకుంది. ప్రయాణ సమయంలో ఇయర్‌ఫోన్స్ లేదా హెడ్‌ఫోన్స్ వెంటతీసుకెళ్లడం మంచిదని, ట్రైన్‌లో మొబైల్ వాడేటప్పుడు కచ్చితంగా వాటిని ఉపయోగించాలని రైల్వే అధికారులు సూచించారు.

## మీ ఫోన్‌లో మీరే యాప్ క్రియేటర్

మొదటి పేజీ తరువాయి

పబ్లిక్‌గా యాప్‌లను విడుదల చేయాలనుకునేవారు మాత్రం ప్రొఫెషనల్ డెవలపర్ అకౌంట్ తీసుకోవాలి. ఆ తర్వాత సాధారణ యాప్‌ల తరహాలోనే భద్రతా తనిఖీలు, నాణ్యతా పరీక్షలు పూర్తిచేయాలి. ఈ సదుపాయం అమెరికా సహా కొన్ని ప్రాంతాల్లో 18 ఏళ్లు పైబడినవారికి దశలవారీగా అందుబాటులోకి వస్తోంది. యాప్‌ల ఎంపికను సులభతరం చేసేందుకు గూగుల్ ఏఐ ఆధారిత టూల్స్‌ను కూడా తీసుకొస్తోంది. 'ఆస్క్ ప్లే' ద్వారా యాప్‌లను పోల్చి, వాటి మధ్య తేడాలను తెలుసుకోవచ్చు. యూజర్ల అభిప్రాయాలనూ పరిశీలించవచ్చు. 'ప్లే ఇన్ జెమినీ' ఫీచర్‌తో గూగుల్ ప్లేలోని యాప్‌లు, గేమ్స్, డెవలపర్ల కంటెంట్‌ను జెమినీ సంభాషణల్లోనే తెలుసుకోవచ్చు. గేమ్స్ కోసం 'గేమ్ ఫైండర్'ను'ను అందుబాటులోకి తెస్తోంది. యూజర్ల అభిరుచులు, ఆటతీరును విశ్లేషించే 'గేమర్ డీఎన్ఏ' ఆధారంగా గేమ్స్‌ను సిఫార్సు చేస్తుంది. గేమ్స్‌ను సొంతంగా జాబితాలుగా రూపొందించుకునేందుకు 'గేమ్ ప్లేలిస్ట్స్' సదుపాయమూ ఉంది. ఈ ఫీచర్ ప్రస్తుతం అమెరికాలో ఇంగ్లిష్‌లో అందుబాటులోకి వస్తోంది. ఇవే కాకుండా ఇద్దరి నుంచి ఐదుగురు కలిసి పాల్గొనే 48 గంటల గేమింగ్ ఛాలెంజ్‌లు, గేమ్‌లో 30 సెకన్ల ఆట దృశ్యాలను రికార్డు చేసే సదుపాయాన్ని కూడా గూగుల్ ప్రకటించింది. కార్లలోని గూగుల్ వ్యవస్థలు, ఎక్స్‌ఆర్ పరికరాల్లో ప్లే స్టోర్ అనుభవాన్ని మెరుగుపరుస్తోంది. పీసీ గేమింగ్ కేటలాగ్‌లోనూ కొత్త గేమ్స్‌ను చేర్చుతోంది.

## ఏపీ 'స్థానిక' షెడ్యూల్ రిలీజ్

మొదటి పేజీ తరువాయి

నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) అమల్లోకి వచ్చింది. తొలి విడతలో భాగంగా 100 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలు ఉన్నాయి. ఈ నెల 16 నుంచి 18 వరకు నామినేషన్లు స్వీకరించనుండగా, 19న పరిశీలన, 21న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. అక్టోబర్ 28న పోలింగ్ నిర్వహించి, 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు. రెండో విడతలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

## యూపీఐ ద్వారా పెన్షన్ ఖాతా

మొదటి పేజీ తరువాయి

డెవలప్‌మెంట్ అథారిటీ' (పీఎఫ్ఆర్‌డీఏ) ప్రవేశపెట్టిన 'తత్కాల్ ఎన్‌పీఎస్' సదుపాయం ద్వారా బ్యాంకు శాఖకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఖాతా తెరవవచ్చు. ఈ సదుపాయం కోసం కొత్తగా ఎలాంటి పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదు. ఇప్పటికే బ్యాంకులో ధ్రువీకరించిన కేవైసీ వివరాల ఆధారంగా ఖాతా ప్రారంభించవచ్చు. వినియోగదారులు తమ పుట్టిన తేదీని నమోదు చేసి, అర్హత ఉన్న బ్యాంకు ఖాతాను ఎంచుకుని, యూపీఐ ద్వారా తొలి చెల్లింపు చేయాలి. ప్రస్తుతం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా ఖాతాదారులకు ఈ సదుపాయం అందుబాటులో ఉంది. త్వరలో మరిన్ని బ్యాంకులను ఇందులో చేర్చనున్నారు. 18 నుంచి 85 ఏళ్ల మధ్య వయసున్న అర్హులైన భారతీయ పౌరులు కనీసం రూ.250 తొలి పెట్టుబడితో ఎన్‌పీఎస్ ఖాతా తెరవవచ్చు.

# పెట్టుబడులకు తెలంగాణ బెస్ట్

## క్యూర్, ప్యూర్, రేర్‌తో సమగ్రాభివృద్ధి.. సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్, అక్టోబర్ 14 (ఈవార్తలు): ప్రపంచ పెట్టుబడులకు తెలంగాణను అత్యుత్తమ గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ సంకల్పమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దేశ జీడీపీలో ప్రస్తుతం 5 శాతంగా ఉన్న తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆయన తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ఫెడరేషన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా 'తెలంగాణ రైజింగ్: 2047 విజన్ డాక్యుమెంట్'ను వివరిస్తూ, రాష్ట్రాన్ని మూడు ప్రధాన జోన్లుగా విభజించి అభివృద్ధి చేయాలన్న తమ ప్రణాళికను వెల్లడించారు. "2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే మా లక్ష్యం. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు 'క్యూర్, ప్యూర్, రేర్' అనే మూడు జోన్లను అభివృద్ధి చేయాలని సంకల్పించాం" అని వివరించారు. క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ): హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ లోపలి ప్రాంతాన్ని ఐటీ, సేవా రంగాలు, అత్యాధునిక టెక్నాలజీ, ఆవిష్కరణలకు కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ప్యూర్ (పెరీ-అర్బన్ రీజియన్ ఎకానమీ): ఓఆర్ఆర్, రీజనల్ రింగ్ రోడ్ మధ్య ఉన్న ప్రాంతంలో తయారీ పరిశ్రమలు, ఇండస్ట్రియల్ పార్కులు, లాజిస్టిక్స్ రంగాన్ని ప్రోత్సహిస్తామని చెప్పారు. రేర్ (రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ): గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, గ్రామీణ ఉపాధిపై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. 2047 నాటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తవుతాయని, ప్రధాని మోదీ నిర్దేశించిన 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని చేరుకోవడంలో రాష్ట్రాల సహకారం కీలకమని రేవంత్ రెడ్డి అన్నారు. "మా ప్రధాన దృష్టి అభివృద్ధిపైనే ఉంది. రాజకీయాలు కేవలం ఎన్నికలకే పరిమితం కావాలి" అని ఆయన వ్యాఖ్యానించారు. చార్మినార్ నుంచి హైటెక్ సిటీ వరకు హైదరాబాద్ ప్రపంచస్థాయి నగరంగా ఎలా రూపాంతరం చెందిందో గుర్తుచేశారు. పెట్టుబడిదారులకు స్నేహపూర్వక విధానాలతో పూర్తి రక్షణ కల్పిస్తామని, 'తెలంగాణ రైజింగ్' లక్ష్యాల సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్థానిక పారిశ్రామికవేత్తలు ప్రపంచస్థాయిలో ఎదగాలని ఆకాంక్షించారు. మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, మహిళా, యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు సూచించారు.

# జనసేనలో చేరిన వంగవీటి రాధా

**కండువా కప్పి ఆహ్వానించిన పవన్ కల్యాణ్**



విజయవాడ, అక్టోబర్ 14 (ఈవార్తలు): మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ జనసేన పార్టీలో చేరారు. బుధవారం అమరావతిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. తిరుపతికి చెందిన ప్రణీత్ ప్రమోద్ కూడా జనసేనలో చేరారు. ఈ పరిణామంతో విజయవాడ మేయర్ అభ్యర్థిగా రాధాకృష్ణ పేరు తెరపైకి వచ్చింది. విజయవాడ మేయర్ పదవికి రాధాకృష్ణ పోటీ చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే, మేయర్ సీటును కూటమిలో జనసేనకు కేటాయిస్తారా? అన్నది ఇంకా స్పష్టం కాలేదు. గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి రాధాకృష్ణ కృషి చేశారు. వైసీపీ నుంచి బయటకు వచ్చిన తర్వాత టీడీపీతో కలిసి పనిచేస్తూ వచ్చారు. ఇప్పుడు జనసేనలో చేరడంతో ఆయన రాజకీయ భవిష్యత్తుపై ఆసక్తి నెలకొంది. మరోవైపు, స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ప్రకటించారు. మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, జడ్పీ చైర్మన్ల పదవులకు రిజర్వేషన్లను ఖరారు చేస్తూ ప్రభుత్వం ఇప్పటికే గెజిట్‌లు విడుదల చేసింది. ఈ తరుణంలో రాధా చేరికకు ప్రాధాన్యం ఏర్పడింది. స్థానిక ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై కూటమి నేతలు చర్చలు జరుపుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో జనసేన నేతలు నాదెండ్ల మనోహర్, లింగమనేని రమేశ్, హరిప్రసాద్ సమావేశమయ్యారు. విజయవాడలోని 86 డివిజన్లలో 35 స్థానాలు తమకు కేటాయించాలని జనసేన కోరుతున్నట్లు సమాచారం. అయితే, 15 స్థానాలు ఇచ్చేందుకు టీడీపీ సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. సీట్ల పంపకాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

# సినిమా చూస్తూ డ్రైవింగ్

**ఆటో డ్రైవర్‌పై వీసీ సజ్జనార్ సీరియస్**



హైదరాబాద్, అక్టోబర్ 14 (ఈవార్తలు): డ్రైవింగ్ చేస్తూ సినిమా చూడటం, చెవులకు హెడ్‌ఫోన్స్ పెట్టుకోవడం వంటి నిర్లక్ష్యపూరిత చర్యలపై హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ తీవ్రంగా స్పందించారు. ఓ ఆటో డ్రైవర్ ఒకేసారి రెండు ఫోన్లు వాడుతూ, చెవులకు హెడ్‌ఫోన్స్ పెట్టుకుని సినిమా చూస్తూ వాహనం నడుపుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆ డ్రైవర్‌ను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఒక నెటిజన్ పంపిన ఈ వీడియోపై సజ్జనార్ తన 'ఎక్స్' ఖాతాలో స్పందించారు. "రెండు కళ్లకు ఎదురుగా రెండు ఫోన్లు, ఒక దాంట్లో నావిగేషన్, మరో దాంట్లో సినిమా, చెవులకు పెద్ద హెడ్‌ఫోన్లు. ఇది చూడటానికి గేమింగ్ విన్యాసంలా ఉన్నా, ప్రయాణికుల పాలిట నడుస్తున్న మృత్యుశకటం" అని ఆయన తీవ్రంగా వ్యాఖ్యానించారు. డ్రైవింగ్ సమయంలో క్షణకాలం దృష్టి మళ్లినా ఘోర ప్రమాదాలు జరుగుతాయని ఆయన హెచ్చరించారు. ఇలా సినిమా చూస్తూ వాహనం నడపడం కేవలం నిర్లక్ష్యం మాత్రమే కాదని, క్షమించరాని నేరమని స్పష్టం చేశారు. మోటార్ వెహికిల్ యాక్ట్ ప్రకారం ఇది 'ప్రమాదకర డ్రైవింగ్' కిందకు వస్తుందని, దీనికి భారీ జరిమానాతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కూడా రద్దయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. వినోదం కోసం ప్రయాణికుల ప్రాణాలను పణంగా పెట్టవద్దని, ఆటోను థియేటర్‌గా మార్చి జీవితాలకు 'ది ఎండ్' కార్డు వేయొద్దని ఆయన హెచ్చరించారు. ఈ విషయంలో ప్రయాణికులు కూడా అప్రమత్తంగా ఉండాలని సజ్జనార్ సూచించారు. డ్రైవర్ ఫోన్ చూస్తున్నా, హెడ్‌ఫోన్లు పెట్టుకున్నా మౌనంగా ఉండవద్దని, వెంటనే ప్రశ్నించి వారించాలని కోరారు. వారు వినని పక్షంలో డయల్ 112కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో, వీడియోలో కనిపించిన టీజీ15యూ2657 నంబర్ గల ఆటో డ్రైవర్‌ను గుర్తించి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులను ఆదేశించినట్లు సజ్జనార్ వెల్లడించారు.

# దుర్గమ్మను సేవలో రాష్ట్రపతి ముర్ము







విజయవాడ, అక్టోబర్ 14 (ఈవార్తలు): రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బుధవారం విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్న వేళ ఆమె అమ్మవారి సన్నిధికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పర్యటన కోసం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు కమలేశ్ పాశ్వాన్, డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, ఎంపీ వల్లభనేని బాలశౌరి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం ఇంద్రకీలాద్రికి చేరుకున్న రాష్ట్రపతికి ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రాష్ట్ర హోంమంత్రి అనిత, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, ఆలయ చైర్మన్ రాధాకృష్ణ, ఈవో షీనా నాయక్ ఆమెను ఆలయంలోకి ఆహ్వానించారు. గర్భాలయంలో అమ్మవారిని దర్శించుకున్న అనంతరం, వేద పండితులు రాష్ట్రపతికి వేదాశీర్వచనాలు అందించారు. ఆలయ అధికారులు ఆమెకు పట్టువస్త్రాలు, అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులను రాష్ట్రపతి ఆప్యాయంగా పలకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ ఆమె ముందుకు సాగారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

# కూరగాయలు కొంటుండగా గుండెపోటు.. మృతి

సూర్యాపేట, అక్టోబర్ 14 (ఈవార్తలు): సూర్యాపేట జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కూరగాయలు కొనుగోలు చేసేందుకు మార్కెట్‌కు వెళ్లిన ఓ వ్యక్తి, అక్కడికక్కడే కుప్పకూలి గుండెపోటుతో మృతి చెందాడు. ఈ హృదయ విదారక ఘటన సూర్యాపేట జిల్లా, చిలుకూరు మండలం, బేతవోలు గ్రామంలో జరిగింది. బేతవోలు గ్రామానికి చెందిన బెజవాడ శ్రీనివాస్ అనే వ్యక్తి కూరగాయల కోసం స్థానిక మార్కెట్‌కు వెళ్లారు. అక్కడ ఓ బండి వద్ద కూరగాయలు కొనుగోలు చేస్తుండగా, ఉన్నట్టుండి అస్వస్థతకు గురై బండి కింద పడిపోయాడు. ఇది గమనించిన స్థానికులు వెంటనే స్పందించి, శ్రీనివాస్‌ను బయటకు తీసి ప్రథమ చికిత్స (సీపీఆర్) చేశారు. ప్రాణం కాపాడేందుకు శాయశక్తులా ప్రయత్నించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హుటాహుటిన సమీపంలోని కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, శ్రీనివాస్‌ను పరీక్షించిన వైద్యులు, అతను అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. శ్రీనివాస్ గుండెపోటు కారణంగా మరణించి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ విషాదకర సంఘటన మొత్తం అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డయింది.

# పెళ్లి తర్వాతే ఐ లవ్ యూ చెప్పండి: అసదుద్దీన్

హైదరాబాద్, అక్టోబర్ 14 (ఈవార్తలు): ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ప్రేమ, పెళ్లి విషయంలో యువతకు ఆసక్తికరమైన సూచనలు చేశారు. ప్రేమ భావనలు వ్యక్తం చేసే కంటే ముందు పెళ్లికి ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు. యువతకు ఎవరైనా అమ్మాయి నచ్చితే, ముందుగా పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకోవాలని, ఆ తర్వాతే ఆమెకు 'ఐ లవ్ యూ' చెప్పాలని సూచించారు. ఓ సభలో యువతను ఉద్దేశించి ఒవైసీ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. జీవితంలో పూర్తిగా స్థిరపడ్డాకే పెళ్లి చేసుకుంటామని చెప్పే యువత తీరును ఆయన తప్పుబట్టారు. "సెటిల్ అయ్యాక పెళ్లి చేసుకోవడం కాదు, పెళ్లి చేసుకుంటేనే జీవితంలో సెటిల్ అవుతారు" అని ఆయన స్పష్టం చేశారు. తన నెరిసిన గడ్డాన్ని చూపిస్తూ, "నా గడ్డం తెల్లబడింది, నేను ఇప్పటికీ పూర్తిగా సెటిల్ అవ్వలేదు. పెళ్లి చేసుకుంటే జీవితంలోని మిగతా అంశాలన్నీ అవే సర్దుకుంటాయి" అని సరదాగా వ్యాఖ్యానించడంతో సభలో నవ్వులు పూశాయి. పెళ్లి చేసుకోని వారు చుట్టుపక్కల వారికి సమస్యలు సృష్టిస్తారని, ఇంట్లో ఎవరూ లేనివారే అందరినీ ఇబ్బంది పెడతారని ఆయన వ్యాఖ్యానించారు. పెళ్లి చేసుకోవడం ద్వారా జీవితంలో స్థిరపడటం చాలా ముఖ్యమని ఆయన నొక్కిచెప్పారు.

# నీళ్లు ఇవ్వొద్దని సీఎంపై అధికారుల ఒత్తిడి

**గుత్తా సుఖేందర్ రెడ్డి ఫైర్**

నల్గొండ, అక్టోబర్ 14 (ఈవార్తలు): శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. నల్గొండ జిల్లాకు సాగునీరు అందకుండా అడ్డుకునేందుకు కొందరు అధికారులు ప్రభుత్వంపై, ముఖ్యమంత్రిపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారని ఆయన ఆరోపించారు. దీనివల్ల జిల్లా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నల్గొండలో ఈరోజు మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈమేరకు ఆవేదన వ్యక్తం చేశారు. నీళ్లన్నీ పాలమూరుకే కేటాయించాలని, డిండి ప్రాజెక్టుకు నీళ్లు ఇవ్వొద్దని కొందరు వాదించడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. "డిండికి నీళ్లు కేటాయించవద్దని అనడం ఏంటి? నల్గొండకు నీళ్లు ఎలా ఇస్తారని సీఎంపై అధికారులు ఒత్తిడి తేవడం ఏంటి?" అని సూటిగా ప్రశ్నించారు. ఇటువంటి ఒత్తిళ్లకు ప్రభుత్వం తలొగ్గకూడదని, ప్రాంతాల మధ్య వివక్ష చూపకుండా పాలకులు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవాలని హితవు పలికారు. ప్రస్తుతం నల్గొండ జిల్లాలో కేవలం 7 లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతోందని గుత్తా గుర్తుచేశారు. మరోవైపు, పాలమూరు ప్రాంతంలో 25 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్లు ప్రారంభించినప్పటికీ, వాటికి నీటి వనరులపై స్పష్టత లేదని అన్నారు. ఈ వివాదానికి ముగింపు పలికేందుకు ఉమ్మడి నల్గొండ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, సమస్యకు సామరస్యపూర్వక పరిష్కారం కనుగొనాలని ఆయన సూచించారు.

# ఎమ్మెల్సీ బరిలో రాంచందర్‌రావు?

**పట్టభద్రుల స్థానాలపై బీజేపీ ఫోకస్**



హైదరాబాద్, అక్టోబర్ 14 (ఈవార్తలు): తెలంగాణలో జరగబోయే రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసే ప్రక్రియను భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ముమ్మరం చేసింది. ఈసారి టికెట్ల కోసం గతంలో ఎన్నడూ లేనంతగా ఆశావహులు పోటీ పడుతుండటంతో, ఎంపిక ప్రక్రియ ఆసక్తికరంగా మారింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ స్థానానికి సిట్టింగ్ ఎమ్మెల్సీ, పార్టీ సీనియర్ నేత ఎన్. రాంచందర్‌రావు పేరు బలంగా వినిపిస్తున్నప్పటికీ, పలువురు సీనియర్లు గట్టిగా లాబీయింగ్ చేస్తుండటంతో పార్టీలో ఉత్కంఠ నెలకొంది. ఈ రెండు స్థానాలకు సంబంధించి ఆశావహుల నుంచి అభిప్రాయాలను సేకరించేందుకు బీజేపీ రెండు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసింది. మంగళవారం ఈ కమిటీలు జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతల నుంచి అభిప్రాయాలను స్వీకరించాయి. ఈ నివేదికలను బుధవారం రాష్ట్ర నాయకత్వానికి అందజేయనున్నాయి. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల స్థానానికి సుమారు 13 మంది, నల్గొండ-ఖమ్మం-వరంగల్ స్థానానికి ఏడుగురు నేతలు పోటీలో ఉన్నారు. హైదరాబాద్ స్థానానికి రాంచందర్‌రావుతో పాటు పార్టీ అధికార ప్రతినిధి ఎన్‌వీ సుభాష్, డోకూరి పవన్‌కుమార్, గౌతమ్ రావు, శ్రీవర్ధన్ రెడ్డి వంటి నేతలు టికెట్ ఆశిస్తున్నారు. అయితే, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ తన అనుచరుడైన పవన్‌కుమార్‌కు టికెట్ ఇవ్వాలని పట్టుబడుతున్నట్లు సమాచారం. మరోవైపు నల్గొండ-ఖమ్మం-వరంగల్ స్థానాన్ని బీసీ అభ్యర్థికి కేటాయించాలనే యోచనలో పార్టీ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ స్థానం కోసం పీఆర్‌టీయూ నేత భిక్షంగౌడ్, పుల్లారావు యాదవ్, డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, కాసం వెంకటేశ్వర్లు తదితరులు పోటీ పడుతున్నారు. రాష్ట్ర నాయకత్వం కమిటీల నివేదికలను పరిశీలించి, ప్రతి స్థానానికి ముగ్గురి పేర్లతో ఒక జాబితాను సిద్ధం చేసి జాతీయ నాయకత్వానికి పంపనుంది. దసరా పండుగ తర్వాత తుది అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. పార్టీ వ్యూహం ప్రకారం, ఒక స్థానాన్ని ఓపెన్ కేటగిరీకి, మరొకటి బీసీ వర్గానికి కేటాయించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలకు మార్చి 2027లో ఎన్నికలు జరగనున్నాయి.




మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజానమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.


# బ్రేక్‌ఫాస్ట్ సూపర్ హిట్


**బడుల్లో 22 శాతం పెరిగిన హాజరు!**

హైదరాబాద్, అక్టోబర్ 14 (ఈవార్తలు): ప్రభుత్వ పాఠశాలల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మానస పుత్రికగా ప్రారంభమైన అల్పాహార పథకం అద్భుతమైన ఫలితాలనిస్తోంది. ఈ పథకం వల్ల విద్యార్థుల హాజరు శాతం గణనీయంగా పెరగడమే కాకుండా, వారిలో ఆరోగ్యపరమైన మార్పులు కూడా కనిపిస్తున్నాయని ఓ స్వతంత్ర సర్వే స్పష్టం చేసింది. కొడంగల్ నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన ఈ పథకంపై 'థర్డ్ విజన్ రీసెర్చ్ అండ్ సర్వీసెస్' సంస్థ ఈ సర్వేను నిర్వహించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు హరే కృష్ణ మూమెంట్ (హెచ్‌కేఎం) చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొడంగల్‌లోని సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా ఈ పథకం అమలవుతోంది. కొడంగల్‌తో పాటు కోస్గీ, బొంరాస్‌పేట, దోమ, తాండూరు సహా పది మండలాల్లోని పాఠశాలల్లో 1,153 మంది విద్యార్థులు, 575 మంది తల్లిదండ్రులు, 176 మంది ఉపాధ్యాయుల నుంచి అభిప్రాయాలు సేకరించి ఈ నివేదికను రూపొందించారు. నివేదిక ప్రకారం, ఈ పథకం ప్రారంభమయ్యాక 60 పాఠశాలల్లో ఏకంగా 1,525 మంది విద్యార్థులు కొత్తగా చేరారు. పాఠశాలల్లో అందిస్తున్న అల్పాహారాన్ని 99.9 శాతం విద్యార్థులు తింటుండగా, ఆకలితో అలమటించే వారి సంఖ్య 98.3 శాతం మేర తగ్గినట్లు తేలింది. గత విద్యా సంవత్సరంతో పోలిస్తే హాజరు శాతం సగటున 20 నుంచి 22 శాతం పెరిగింది. ఉపాధ్యాయులు సైతం పథకం నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. 97.7 శాతం మంది సమయానికి అల్పాహారం అందుతోందని తెలిపారు.



# జగన్ అక్రమాస్తుల కేసులో రోజువారీ విచారణ

హైదరాబాద్, అక్టోబర్ 14 (ఈవార్తలు): మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించిన అక్రమాస్తుల కేసుల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆయనపై ఉన్న సీబీఐ కేసులతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసులను కూడా రోజువారీగా విచారించాలని సీబీఐ కోర్టు నిర్ణయించింది. ఈ నిర్ణయంతో పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణ వేగవంతం కానుంది. ఈ కేసుల్లో జగన్‌తో పాటు మరో 70 మంది నిందితులను వ్యక్తిగతంగా విచారించాలని న్యాయస్థానం నిర్ణయం తీసుకుంది. జగన్‌పై దాదాపు దశాబ్దకాలంగా 9 ఈడీ ఛార్జిషీట్లు న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్నాయి. వీటిపై విచారణను వేగవంతం చేయాలని కోరుతూ ఈడీ అధికారులు ఇప్పటికే తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. సీబీఐ కోర్టులో నిందితులు దాఖలు చేసుకున్న డిశ్చార్జ్ పిటిషన్లపై తీర్పులు రాకపోవడంతో కేసుల విచారణ ముందుకు సాగడం లేదని ఈడీ తన పిటిషన్‌లో పేర్కొంది. ఈడీతో పాటు మాజీ మంత్రి హరిరామజోగయ్య, మరికొందరు కూడా విచారణను వేగవంతం చేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో సీబీఐ కోర్టు తీసుకున్న తాజా నిర్ణయంతో జగన్‌పై ఉన్న కేసుల విచారణ ఇకపై వేగంగా ముందుకు సాగే అవకాశం కనిపిస్తోంది.




### ఆపదలో పేదలకు
# సీఎంఆర్ఎఫ్ భరోసా

**111 మంది లబ్ధిదారులకు రూ.31.08 లక్షల సాయం**

**చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

గంగాధర, అక్టోబర్ 14 (ఈవార్తలు): అనారోగ్యంతో బాధపడుతూ, ప్రమాదాల్లో గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) భరోసా కల్పిస్తోందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 111 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.31,08,700 ఆర్థిక సాయం మంజూరు చేసింది. ఈ మేరకు బుధవారం గంగాధరలోని ప్రజా కార్యాలయంలో ఎమ్మెల్యే లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం పంపిణీ చేసిన సీఎంఆర్ఎఫ్ చెక్కుల కంటే రెట్టింపు చెక్కులను కేవలం మూడేళ్లలోనే పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు ఈ సాయం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యేకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్, వేముల భాస్కర్, రేండ్ల శ్రీనివాస్, చిందం ఆంజనేయులు, బిర్ల ఆనందం, రాచమల్ల రవి, బాసవేణి శ్రీనివాస్, దాసరి శంకరయ్య, ఈటవేణి శ్రీనివాస్, పడాల భాగ్యలక్ష్మి రాజన్న, దానే అనసూయ ఓదెలు, కడారి రేణుక కనకయ్య, సంధ్య చంద్రారెడ్డి, కవిత మల్లేశం, బాబా లక్ష్మి మధు, పురుమల్ల మనోహర్, సాగి అజయ్‌రావు, చిరుతమంగ, తోట సంధ్య తదితరులు పాల్గొన్నారు.



### భక్తిశ్రద్ధల నడుమ దుర్గమ్మ తెప్పోత్సవం

**మల్యాలలో వైభవంగా దేవీ నవరాత్రి వేడుకలు**

మల్యాల, అక్టోబర్ 14 (ఈవార్తలు): మల్యాల మండల కేంద్రంలో నవదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారి తెప్పోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నామస్మరణలు, భక్తిగీతాలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన తెప్పోత్సవం భక్తులను ఆకట్టుకుంది. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు నవదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని భక్తులు ప్రార్థించారు.



### వివేకానంద కళాశాలలో
# బతుకమ్మ సంబరాలు


కూకట్‌పల్లి, అక్టోబర్ 14 (ఈవార్తలు): కూకట్‌పల్లిలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సందర్భంగా కళాశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో సందడి చేస్తూ జానపద నృత్యాలు, దాండియా ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కొరదల నరేష్ విద్యార్థులకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ తల్లి ఆశీస్సులతో అందరి జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. కళాశాల డైరెక్టర్ కొరదల లావణ్య కూడా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించడం, పండుగల ప్రాముఖ్యతను తెలియజేయడం ఇటువంటి కార్యక్రమాల ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ బి.ఎస్. రాజేష్, మేనేజర్ రాజేశ్వరరావు, అధ్యాపకులు, సిబ్బంది సమన్వయంతో వేడుకలు నిర్వహించారు.

### 45 గ్రాముల గంజాయి పట్టివేత

ధర్మారం, అక్టోబర్ 14 (ఈవార్తలు): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామ శివారులో 45 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో రంగంపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ తాజ్‌బాబాను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ ఎంబడి శ్రీకాంత్ తెలిపారు. దొంగతుర్తి శివారులో అనుమానాస్పదంగా కనిపించిన సయ్యద్ తాజ్‌బాబాను తనిఖీ చేయగా గంజాయి లభించినట్లు ఎస్ఐ వెల్లడించారు. గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుడిపై తదుపరి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై నిరంతరం నిఘా ఉంచుతున్నామని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# అన్నపూర్ణ దేవిగా మైసమ్మ తల్లి దర్శనం

అంబర్‌పేట్, అక్టోబర్ 14 (ఈవార్తలు): అంబర్‌పేట్ జైస్వాల్ గార్డెన్‌లోని మైసమ్మ దేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం అమ్మవారు శ్రీ అన్నపూర్ణ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, హోమాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. కాలనీవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో అంబర్‌పేట్ మాజీ కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి, గోల్నాక మాజీ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్, అంబర్‌పేట్ అదనపు డీసీపీ నర్సయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు చెరుకు యాదవరెడ్డి, ప్రధాన కార్యదర్శి సి.హెచ్. ఇంద్రసేన్ యాదవ్, చైర్మన్ ఎన్. రమేష్ గౌడ్, ఉపాధ్యక్షుడు కె. దిలీప్ గౌడ్, కోశాధికారి పి. వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు. ముఖ్య సలహాదారులు జి. ప్రసన్నాంజనేయులు, జి. సురేందర్, ఎ. రామగౌడ్, బి. మధుసూదన్ చారి, పి. శ్రీహరి చారితో పాటు కమిటీ సభ్యులు పి. రామస్వామి, కె. ఈశ్వరయ్య, కె. అశోక్ కుమార్, టి. కృష్ణవేణి హాజరయ్యారు. కాలనీవాసులు లక్ష్మయ్య గౌడ్, ఎ. సత్యనారాయణ, చింతల శ్రీనివాస్ ముదిరాజ్, స్వామి గౌడ్, పర్వాతలు, కె. సత్యనారాయణ, శ్రీనివాస్ గౌడ్, విజయ్ బాబు, శ్రీనివాస్ గుప్తా, కె. శ్రీధర్, రాకేష్, నరేష్, రాంచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.



# కూష్మాండ అవతారంలో అమ్మవారు



జగిత్యాల, అక్టోబర్ 14 (ఈవార్తలు): కనకదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో అష్టలక్ష్మి దేవాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న దుర్గాశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం అమ్మవారు కూష్మాండ అవతారంలో శాకాంబరీ అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యపూజలు, నక్షత్ర హారతి అనంతరం అభిషేకం నిర్వహించారు. భవానీ మాతలు, దీక్షాపరులు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి సప్త హారతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేసినట్లు కనకదుర్గ సేవా సమితి సభ్యులు తెలిపారు.

# విద్యుత్ కోతలతో రైతులకు ఇబ్బందులు

కొడిమ్యాల, అక్టోబర్ 14 (ఈవార్తలు): కొడిమ్యాల మండలంలో తరచూ విద్యుత్ కోతలు విధించడం వల్ల రైతులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతూ పూడూరు విద్యుత్ ఉపకేంద్రం సహాయ ఇంజినీర్‌కు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ బావులు, బోర్లలో నీరు ఉన్నప్పటికీ విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో పంటలకు సమయానికి నీరు అందించలేకపోతున్నారని నాయకులు తెలిపారు. దీంతో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గృహ వినియోగదారులు సైతం తరచూ విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత పదేళ్లలో ఇలాంటి సమస్యలను ఎదుర్కోలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో



తరచూ కోతలు విధిస్తున్నారని వారు విమర్శించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు రేకులపల్లి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బండ నర్సింహారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చల్లా శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శులు బైరి హరీష్, మానుపాటి శేఖర్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మంచాల భూమేష్, నాయకులు బుచ్చి రాములు, ఏలేటి నరసింహారెడ్డి, నర్సాగౌడ్, బీజేవైఎం అధ్యక్షుడు గొనపల్లి పొన్నం, అజయ్ గౌడ్, బండి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ సాగుపై దృష్టి పెట్టాలి: అడ్లూరి

జగిత్యాల, అక్టోబర్ 14 (ఈవార్తలు): ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు ముందస్తు ప్రణాళికతో ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. రైతులకు శాస్త్రీయ సలహాలు అందించాలని, పంటలు ఎండిపోకుండా అవసరమైన విద్యుత్ సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. జగిత్యాల జిల్లా పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో వ్యవసాయ శాఖ ఆత్మ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కిసాన్ మేళా–2026లో మంత్రి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నీటి లభ్యత, నేల స్వభావం, పెట్టుబడి వ్యయం, మార్కెట్ డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకొని పంటలను ఎంపిక చేసుకోవాలని



సూచించారు. వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలతో ఆధునిక పద్ధతుల్లో సాగు చేపట్టాలన్నారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అందిపుచ్చుకొని పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకుంటూ అధిక దిగుబడులు సాధించాలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. పంటల ఎంపిక, విత్తనాలు, ఎరువులు, చీడపీడల నివారణపై గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. కిసాన్ మేళాలో ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శనశాలలను ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించి ఆధునిక యంత్రాలు, నూతన సాగు పద్ధతుల గురించి తెలుసుకున్నారు. ఉత్తమ రైతులు, వ్యవసాయ అధికారులను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్, జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# మిరప రైతులకు అండగా 'సాథి'

**నాగారంలో 'కేతిక' కేంద్రం ఏర్పాటు**

**శాస్త్రీయ సాగుపై రైతులకు మార్గదర్శనం**

నాగారం, అక్టోబర్ 14(ఈవార్తలు): ఎర్ర మిరప రైతులకు శాస్త్రీయ సాగు పద్ధతులపై మార్గదర్శకత్వం అందించడంతో పాటు, సాగు ఖర్చులు తగ్గించి పంట నాణ్యతను మెరుగుపరిచే లక్ష్యంతో హనుమకొండ జిల్లా నాగారం గ్రామంలో కేతిక సంస్థ 'సాథి' కేంద్రాన్ని బుధవారం ప్రారంభించింది. సమగ్ర సస్యరక్షణ నిర్వహణ (ఐపీఎం), సుస్థిర వ్యవసాయ పద్ధతులు, చీడపీడల నియంత్రణ, పంట నిర్వహణపై రైతులకు ఈ కేంద్రం ద్వారా సహకారం అందించనున్నారు. కేంద్రం ప్రారంభోత్సవంలో కేతిక సీఈవో, సహ వ్యవస్థాపకుడు డా. పృథ్వీ సింగ్, సహ వ్యవస్థాపకుడు రఘువీర్ అలాడా, సీవోవో రామ్ సింగ్, వరంగల్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్తలు డా. ఎ. రాజు, డా. అరుణ్‌జ్యోతి, నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ చంద్రశేఖర్, మాజీ చీఫ్ జనరల్ మేనేజర్ సుశీల చింతల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. పృథ్వీ సింగ్ మాట్లాడుతూ.. రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే శాస్త్రీయ, సుస్థిర వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ముఖ్యమన్నారు. రైతులకు సాంకేతిక మార్గదర్శకత్వం అందించడం, మెరుగైన పంట నిర్వహణను ప్రోత్సహించడం, నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తుల సాధనలో సాథి కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఎర్ర మిరప సాగులో చీడపీడలను సకాలంలో గుర్తించి నియంత్రించడం, అవసరానికి అనుగుణంగా పంట రక్షణ చర్యలు చేపట్టడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చని నాబార్డు ప్రతినిధులు వివరించారు. పంట నాణ్యతను కాపాడటంతో పాటు రైతుల ఆదాయాన్ని మెరుగుపరిచేందుకు సమగ్ర సస్యరక్షణ నిర్వహణ దోహదపడుతుందని తెలిపారు. కేవీకే శాస్త్రవేత్తలు కూడా రైతులకు వ్యవసాయ సేవలు, ఆధునిక సాంకేతికతలు, పంటల రక్షణపై అవగాహన కల్పించారు. నాగారం సాథి కేంద్రం స్థానిక రైతులతో సమన్వయంతో పనిచేస్తుందని రఘువీర్ అలాడా తెలిపారు. పంట పెరుగుదలలోని వివిధ దశల్లో సాంకేతిక సలహాలు అందించడం, వ్యవసాయ ఇన్‌పుట్‌లను అవసరమైన మేరకే వినియోగించేలా చూడటం, పర్యావరణహిత సాగు పద్ధతులను ప్రోత్సహించడం కేంద్రం ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేతిక ప్రతినిధులు గోవింద్ సింగ్ ఖించీ, కాజోడ్ మల్ కుమావత్, నాగారం సర్పంచ్ రాందేవి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





### అన్నప్రసాద వితరణలో బండి రమేశ్

కూకట్‌పల్లి, అక్టోబర్ 14 (ఈవార్తలు): దసరా నవరాత్రుల సందర్భంగా అల్లాపూర్ శివాజీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ పాల్గొన్నారు. లక్ష్మణ్ గౌడ్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ దసరా నవరాత్రులు భక్తి, ఐక్యత, సోదరభావానికి ప్రతీకలని అన్నారు. పండుగల సమయంలో అన్నదానం చేయడం గొప్ప సేవా కార్యక్రమమని, ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడం మానవత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. పేదలకు, అవసరంలో ఉన్నవారికి సహాయం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు వాజిద్ పాషా, మస్తాన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వేముల సత్యం, తిరుపతి, నరసింహ యాదవ్, అబ్దుల్లా, జమీర్, వాసు, రేష్మ తదితరులు పాల్గొన్నారు.

### యువతలో భక్తిభావం పెరగడం హర్షణీయం: ఏసీఎస్ రాజు



జగిత్యాల, అక్టోబర్ 14 (ఈవార్తలు): పట్టణంలోని పురానిపేట ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో శ్రీ భవాని భక్త బృందం ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహాన్ని భారత్ సురక్షా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతీ యువకులు భవానీ దీక్షలు స్వీకరించి భక్తిశ్రద్ధలతో అమ్మవారిని ఆరాధించడం హర్షణీయమన్నారు. నవరాత్రులు చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తాయని తెలిపారు. జగన్మాత కరుణాకటాక్షాలు సకల జీవులపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యశోద రాజమౌళి, కాసబోయిన పెద్ద నరసయ్య, కస్తూరి రాజు పాల్గొన్నారు.



### ఉక్రెయిన్‌లో మృతుడి కుటుంబానికి 6 లక్షల చెక్కు అందజేత

జగిత్యాల, అక్టోబర్ 14 (ఈవార్తలు): రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన జగిత్యాల జిల్లా హస్నాబాద్ గ్రామానికి చెందిన వావిలాల సుదర్శన్ గౌడ్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.6 లక్షల ఆర్థిక సాయం అందించింది. ప్రభుత్వ సాయం చెక్కును రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఉపాధి కోసం నాలుగు నెలల క్రితం ఉక్రెయిన్‌కు వెళ్లిన సుదర్శన్ గౌడ్ క్షిపణులు, డ్రోన్ దాడుల్లో మృతి చెందినట్లు సమాచారం. బాధిత కుటుంబం విజ్ఞప్తి మేరకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ముఖ్యమంత్రి రూ.6 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. మృతుడి కుటుంబ సభ్యులకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం తరఫున బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్యతో పాటు జిల్లా, మండల నాయకులు, ఎన్ఆర్ఐ విభాగం సభ్యులు పాల్గొన్నారు.



### డీసీసీ మైనారిటీ చైర్మన్ నయీమ్‌కు సన్మానం

జగిత్యాల, అక్టోబర్ 14 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ మైనారిటీ విభాగం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం.ఏ. నయీమ్‌ను కోరుట్లలో ఏఆర్ వెజిటబుల్స్ యాజమాన్యం ఘనంగా సన్మానించింది. యాజమాన్య ప్రతినిధులు మొహమ్మద్ అర్షద్, మొహమ్మద్ అష్ణ ఆయనకు శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. మైనారిటీల అభ్యున్నతి, యువత సంక్షేమం, సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధికి నయీమ్ మరింత కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. ప్రజలతో సత్సంబంధాలు కలిగి, ప్రజాసేవలో చురుగ్గా పాల్గొనే ఆయనకు జిల్లా స్థాయిలో కీలక బాధ్యతలు దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు మైనారిటీ యువకులు పాల్గొన్నారు.

### జగిత్యాల అదనపు కలెక్టర్‌గా ప్రసూనాంబ బాధ్యతలు

జగిత్యాల, అక్టోబర్ 14 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా ఎస్. ప్రసూనాంబ బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆమెను ఈ పదవిలో నియమించారు. గతంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయంలో ప్రతినియుక్తిపై విధులు నిర్వహించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రజలతో మమేకమై విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ జిల్లాకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. అనంతరం జిల్లా పరిపాలనకు సంబంధించిన అంశాలపై ఇరువురూ చర్చించారు. జిల్లా రెవెన్యూ అధికారి కే.వై. ప్రసాద్, కలెక్టరేట్ పరిపాలనాధికారి కిషన్, సిబ్బంది అదనపు కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



## ఇందిరమ్మ ఇళ్లతో సొంతింటి కల సాకారం: సంజయ్

జగిత్యాల, అక్టోబర్ 14 (ఈవార్తలు): ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కల సాకారమవుతోందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. రాయికల్ మండలం కట్కాపూర్, అలియా నాయక్ తండాలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని, లబ్ధిదారులకు చీరలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గానికి మొదటి విడతలో 3,300, రెండో విడతలో మరో 2,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. అర్హులైన ప్రతి నిరుపేదకు ఇల్లు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం కట్కాపూర్, ఆలూరు గ్రామాల్లో నిర్వహిస్తున్న దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.




## రాజారాంపల్లిలో ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు

ఎండపల్లి, అక్టోబర్ 14 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజారాంపల్లిలో సర్పంచ్ సంగ రమేష్ ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం దేవీ మండపం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించడంతో పాటు గ్రామంలోని ఆడబిడ్డలకు చీరలు, పసుపు, కుంకుమ, గాజులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, రాష్ట్ర సీనియర్ నాయకుడు మద్దుల గోపాల్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మహిళలకు చీరలు, మంగళద్రవ్యాలను అందజేశారు. భక్తి, సంప్రదాయాలతో పాటు సేవాభావాన్ని చాటేలా ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎండపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గెల్లు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి కందికట్ల రాజేష్, పలువురు నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## షార్జాలో భారతీయుడికి 13 కోట్ల లాటరీ




షార్జా: యూఏఈలోని షార్జాలో నివసిస్తున్న కిషోర్ అనే ప్రవాస భారతీయుడిని అదృష్టం వరించింది. ఆయన ఏకంగా 5 మిలియన్ దిర్హమ్‌ల (సుమారు రూ. 13 కోట్లు) లాటరీ గెలుచుకున్నారు. యూఏఈ లాటరీలో రెండో బహుమతిని ఆయన సొంతం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. అక్టోబర్ 3న యూఏఈ లాటరీ నిర్వాహకులు డ్రా తీశారు. ఈ డ్రాలో కిషోర్ కొనుగోలు చేసిన టికెట్‌కు రెండో బహుమతి దక్కింది. ఆయన అధికారిక వెబ్‌సైట్ ద్వారా 50 దిర్హమ్‌లు (సుమారు రూ. 1300) వెచ్చించి ఈ టికెట్‌ను కొనుగోలు చేశారు. లాటరీ ఫలితాలు వెలువడిన తర్వాత, విజేతల జాబితాలో తన పేరు చూసి మొదట నమ్మలేకపోయానని కిషోర్ తెలిపారు. ఆ తర్వాత తన వద్ద ఉన్న టికెట్ నంబర్‌తో సరిచూసుకుని, విజేతను తానేనని నిర్ధారించుకున్నట్లు ఆనందం వ్యక్తం చేశారు. ఈ లాటరీ డ్రాలో 30 మిలియన్ దిర్హమ్‌ల (సుమారు రూ. 78 కోట్లు) భారీ జాక్‌పాట్‌ను ఎవరూ గెలుచుకోలేదని నిర్వాహకులు తెలిపారు. కిషోర్ లాటరీ గెలిచిన విషయాన్ని యూఏఈ లాటరీ నిర్వాహకులు అధికారికంగా ప్రకటించారు. ఒక్క లాటరీ టికెట్‌తో రాత్రికి రాత్రే కోటీశ్వరుడైన కిషోర్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

## నెట్‌ఫ్లిక్స్‌లో 1,000 మంది అవుట్

**దాదాపు 6 శాతం మందికి ఉద్వాసన**




న్యూయార్క్: ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ భారీగా ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమైంది. సుమారు 1,000 మంది ఉద్యోగాలకు కోత పెట్టాలని నిర్ణయించింది. 2022 తర్వాత సంస్థ చేపడుతున్న అతిపెద్ద తొలగింపులు ఇవే. కంపెనీ వృద్ధి వేగం తగ్గడం, ప్రేక్షకుల కోసం ఇతర స్ట్రీమింగ్ సంస్థల నుంచి పోటీ పెరుగుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు 'ది వాల్ స్ట్రీట్ జర్నల్' కథనం వెల్లడించింది. ఈ తొలగింపులతో నెట్‌ఫ్లిక్స్ మొత్తం ఉద్యోగుల్లో దాదాపు ఆరు శాతం మంది ప్రభావితమయ్యే అవకాశం ఉంది. ప్రొడక్ట్, టెక్నాలజీ, న్యాయ, మానవ వనరుల విభాగాల్లో ఎక్కువ కోతలు ఉండనున్నట్లు సమాచారం. సంస్థ సహ-సీఈవోలు టెడ్ సరాండోస్, గ్రెగ్ పీటర్స్ బుధవారం ఉద్యోగులకు ఈ నిర్ణయాన్ని ఈమెయిల్ ద్వారా తెలియజేశారు. సబ్‌స్క్రిప్షన్ల ద్వారా వచ్చే ఆదాయానికే పరిమితం కాకుండా ప్రకటనలు, లైవ్ కార్యక్రమాలు, గేమింగ్ రంగాల్లోకి విస్తరించాలని నెట్‌ఫ్లిక్స్ ప్రయత్నిస్తోంది. అయితే ఆశించిన స్థాయిలో వృద్ధి సాధించలేకపోతున్నట్లు సంస్థ యాజమాన్యం అంగీకరించింది. సెప్టెంబర్ చివర్లో బ్లూమ్‌బెర్గ్ నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడిన టెడ్ సరాండోస్.. కంపెనీ వృద్ధి తాను కోరుకున్నంత వేగంగా లేదని వ్యాఖ్యానించారు. వృద్ధి వేగాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

# భారత్‌తో సంబంధాలు గాడిన పడుతున్నాయ్



ఒట్టావా: ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య తర్వాత తీవ్రంగా దెబ్బతిన్న భారత్-కెనడా ద్వైపాక్షిక సంబంధాలు ఇప్పుడు మళ్లీ గాడిన పడుతున్నాయని, క్రమంగా బలపడుతున్నాయని కెనడా విదేశాంగ మంత్రి అనితా ఆనంద్ అన్నారు. ఓ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ, ఇరు దేశాల మధ్య సంబంధాలలో చోటుచేసుకుంటున్న ఈ మార్పును ఆమె ఒక "ఆహ్వానించదగ్గ పరిణామం"గా అభివర్ణించారు. వాణిజ్యం, పర్యాటకం, విద్య వంటి రంగాల్లో ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలు చాలా లోతుగా, బలంగా ఉన్నాయని ఆనంద్ తెలిపారు. రాబోయే దశాబ్దంలో అమెరికాయేతర దేశాలతో వాణిజ్యాన్ని రెట్టింపు చేసుకోవాలని కెనడా లక్ష్యంగా పెట్టుకుందని, ఈ నేపథ్యంలో 4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, ప్రపంచంలో ఆరవ అతిపెద్ద శక్తిగా ఉన్న భారత్ తమకు ఎంతో ముఖ్యమని ఆమె నొక్కిచెప్పారు. నిజ్జర్ హత్య ఉదంతంపై మాట్లాడుతూ.. కెనడా గడ్డపై ఒక కెనడా పౌరుడి హత్యకు సంబంధించిన కేసులో న్యాయపరమైన విచారణ కొనసాగుతోందని ఆమె స్పష్టం చేశారు. చట్టబద్ధ పాలన, దేశీయ భద్రతకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. భారత ప్రభుత్వంతో చర్చల్లో గణనీయమైన పురోగతి సాధించామని, ఇందులో భాగంగానే 'బిష్ణోయ్ గ్యాంగ్'ను ఉగ్రవాద సంస్థగా గుర్తించామని వెల్లడించారు. కెనడాలో నిరసనల సందర్భంగా ఖలిస్థాన్ అనుకూల నినాదాలు, ఇందిరా గాంధీ హత్యను ప్రస్తావించడం వంటి ఘటనలపై అడిగిన ప్రశ్నకు.. కెనడాలో భావప్రకటనా స్వేచ్ఛకు, ప్రజా భద్రతకు మధ్య సమతుల్యం పాటించాల్సిన అవసరం ఉందని బదులిచ్చారు. ఈ అంశాన్ని దేశ ప్రజా భద్రత, న్యాయశాఖ మంత్రులు పర్యవేక్షిస్తున్నారని, తన దృష్టి అంతా విదేశీ సంబంధాలపైనే ఉందని ఆమె వివరించారు. కెనడా ప్రధాని మార్క్ కార్నీ, భారత ప్రధాని నరేంద్ర మోదీతో తన సంబంధానికి ఎంతో విలువ ఇస్తారని అనితా ఆనంద్ చెప్పారు. ఈ ఏడాది డిసెంబర్‌లో కెనడా పర్యటనకు రానున్న ప్రధాని మోదీకి స్వాగతం పలికేందుకు తాము ఎదురుచూస్తున్నామని ఆమె వెల్లడించారు. ఇప్పటికే ఇరు దేశాల రాయబార కార్యాలయాలను బలోపేతం చేశామని, ఇరు దేశాల నేతలు క్రమం తప్పకుండా సమావేశమవుతూ సంబంధాలను మెరుగుపరుస్తున్నారని గుర్తుచేశారు.

# 16న ఢిల్లీలో 'తిరంగా' నిరసన



న్యూఢిల్లీ: తమ పార్టీ సహ కన్వీనర్లు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ అక్టోబర్ 16న ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో త్రివర్ణ పతాక ప్రదర్శన నిర్వహించనున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రకటించారు. దేశభక్తులంతా జాతీయ జెండాలతో సెంట్రల్ పార్క్‌కు రావాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో విడుదల చేసిన వీడియో సందేశంలో ఈ నిరసనకు 'లెహ్రావో దో తిరంగా' అని పేరు పెట్టినట్లు దీప్కే తెలిపారు. కేవలం త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించినందుకే సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను జైలుకు పంపారని ఆయన ఆరోపించారు. అక్టోబర్ 16న సాయంత్రం 5 గంటలకు కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌కు జాతీయ జెండాలతో చేరుకోవాలని కోరారు. త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడం నేరం కాదని ఈ కార్యక్రమం ద్వారా చాటిచెబుతామని అన్నారు. ఢిల్లీకి రాలేని వారు తమ ప్రాంతాల్లో తిరంగా మార్చ్‌లు నిర్వహించాలని దీప్కే విజ్ఞప్తి చేశారు. జాతీయ జెండా తమ గర్వకారణమని, దాన్ని ప్రదర్శించడం నేరం కాదనే సందేశాన్ని అందించాలని కోరారు. ఈ నిరసన తర్వాత తనను కూడా అరెస్టు చేసే అవకాశం ఉందని, అయినా ఆందోళన చెందడం లేదని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శిస్తానని స్పష్టం చేశారు. మరోవైపు, జంతర్ మంతర్‌లోకి అక్రమంగా ప్రవేశించిన కేసులో సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలకు బుధవారం ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారు. సీజేపీకి చెందిన మరో నేత అజింక్య షిండే వ్యక్తిగత పూచీకత్తుపై విడుదలయ్యారు. దాస్‌ను తీహార్ జైలులోని రెండో నంబర్ జైలులో, రంకాను నాలుగో నంబర్ జైలులో వేర్వేరుగా ఉంచినట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వర్గాలు తెలిపాయి. ముగ్గురు సీజేపీ సభ్యులను జంతర్ మంతర్‌లోకి చొరబడినందుకు ముందస్తు నిర్బంధంలోకి తీసుకున్నారు. జంతర్ మంతర్‌ను నిరసనలకు కేటాయించిన అధికారిక ప్రదేశాల జాబితా నుంచి తొలగించిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం.




# 21 నుంచి జియో ఐపీఓ

ముంబై: దేశీయ టెలికం, డిజిటల్ రంగంలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ (ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్) తేదీలు ఖరారయ్యాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ డిజిటల్ అనుబంధ సంస్థ అయిన జియో ప్లాట్‌ఫామ్స్ ఈ మేరకు కీలక ప్రకటన చేసింది. భారత స్టాక్ మార్కెట్ చరిత్రలో ఇది ఒక కీలక ఐపీఓగా నిలవనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. కంపెనీ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ అక్టోబర్ 21న ప్రారంభమై అక్టోబర్ 23న ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్ల కోసం బిడ్డింగ్ విండోను అక్టోబర్ 19న తెరవనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రాథమిక పత్రాలను ఇప్పటికే రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్ఓసీ) వద్ద దాఖలు చేసినట్లు కంపెనీ తెలిపింది. ఈ ఐపీఓ ద్వారా మొత్తం 27 కోట్ల షేర్లను విక్రయించనున్నారు. ఇది 100 శాతం ఫ్రెష్ ఇష్యూ. అంటే ఈ ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులన్నీ కంపెనీ వ్యాపార విస్తరణ, ఇతర అవసరాలకే వినియోగిస్తారు. కంపెనీలోని ప్రస్తుత వాటాదారులు ఎవరూ తమ షేర్లను అమ్మడం లేదు. ఈ ఐపీఓలో రిలయన్స్ ఉద్యోగులకు, మాతృ సంస్థ అయిన రిలయన్స్ ఇండస్ట్రీస్ వాటాదారులకు ప్రత్యేక కోటాను కేటాయించారు. ఉద్యోగుల కోసం రూ. 500 కోట్ల విలువైన షేర్లను, రిలయన్స్ ఇండస్ట్రీస్ వాటాదారుల కోసం రూ. 2,500 కోట్ల విలువైన షేర్లను రిజర్వ్ చేసినట్లు కంపెనీ తన ప్రాస్పెక్టస్‌లో పేర్కొంది. జియో ప్లాట్‌ఫామ్స్ పనితీరు, భవిష్యత్ ప్రణాళికల నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఈ ఐపీఓ కోసం ఎంతో కాలంగా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# దేశాన్ని ఎందుకు నాశనం చేస్తున్నావ్?

## ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో అభిజిత్ దీప్కేకు నిరసన సెగ



న్యూఢిల్లీ: కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేకు ఢిల్లీలో చేదు అనుభవం ఎదురైంది. బుధవారం ఆయన ఢిల్లీ విమానాశ్రయంలో దిగిన వెంటనే ఒక వ్యక్తి ఆయనను అడ్డుకుని నిలదీశారు. "దేశాన్ని ఎందుకు నాశనం చేస్తున్నారు?" అంటూ ఆ వ్యక్తి గట్టిగా అరవడంతో ఎయిర్‌పోర్ట్‌లో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే, దీప్కే మాత్రం నవ్వుతూ, నిరసనకారుడికి థమ్సప్ చూపిస్తూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. అక్టోబర్ 10న తన నానమ్మ మరణించడంతో స్వస్థలమైన మహారాష్ట్రకు వెళ్లిన దీప్కే, బుధవారం మధ్యాహ్నం తిరిగి రాజధానికి చేరుకున్నారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా అక్టోబర్ 10న నిరసనలకు నాయకత్వం వహించేందుకు వచ్చినప్పుడు కూడా పోలీసులు ఆయనను విమానం నుంచి అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఢిల్లీలో అడుగుపెట్టిన వెంటనే, తన సహచరులు అశుతోష్ రంకా, సౌరవ్ దాస్‌లను అరెస్ట్ చేసి ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపడంపై ఆయన కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "త్రివర్ణ పతాకాన్ని ఎగరేయడం నేరమా? కేవలం జంతర్ మంతర్ వద్ద జాతీయ జెండాను ఎగరేసినందుకే అశుతోష్, సౌరవ్‌లను ఐదు రోజులు జైలుకు పంపారు. గతంలో బ్రిటిష్ పాలనలో ఇలా జరిగేది. అప్పట్లో స్వాతంత్ర్య సమరయోధులు బహిరంగ ప్రదేశాల్లో జెండా ఎగరేస్తే అరెస్ట్ చేసి జైల్లో పెట్టేవారు" అని దీప్కే తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

# జర్మనీలో ముగ్గురు భారతీయుల సజీవ దహనం

దర్బన్: జర్మనీలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో ముగ్గురు భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. బోచుమ్ నగరంలోని ఓ నివాస భవనంలో చోటుచేసుకున్న ఈ విషాద ఘటనలో మరో ఐదుగురు గాయపడ్డారు. ఈ సంఘటనపై హత్య అనుమానంతో పోలీసులు ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. బోచుమ్‌లోని హోఫ్‌స్టెడ్ జిల్లాలో ఉన్న ఓ నివాస భవనంలో మంగళవారం తెల్లవారుజామున మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం భవనంలోని రెండో అంతస్తులో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో ముగ్గురి మృతదేహాలను గుర్తించారు. మృతులను 25, 27 ఏళ్ల వయసున్న ఇద్దరు యువతులుగా, 26 ఏళ్ల యువకుడిగా గుర్తించారు. వీరంతా భారతీయులని అధికారులు నిర్ధారించారు. ఈ ప్రమాదంలో పొగ పీల్చడం వల్ల తీవ్ర అస్వస్థతకు గురైన మరో ఐదుగురిని చికిత్స కోసం స్థానిక ఆసుపత్రులకు తరలించారు. ప్రస్తుతం వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అయితే గాయపడిన వారి జాతీయతకు సంబంధించిన వివరాలు తెలియరాలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రాథమిక విచారణ అనంతరం అదే భవనంలో నివసించే 41 ఏళ్ల రొమేనియా దేశస్థుడిని హత్య అనుమానంతో అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ అగ్నిప్రమాదం ప్రమాదవశాత్తు జరిగిందా లేక ఎవరైనా ఉద్దేశపూర్వకంగా చేశారా అనే కోణంలో విచారణ కొనసాగుతోంది.




## 31 దేశాల పైలట్లపై 'ఎయిర్ ఫ్రాన్స్' నిషేధం

న్యూఢిల్లీ: ఇజ్రాయెల్‌కు వెళ్లే తమ విమానాల్లో పనిచేసే సిబ్బంది విషయంలో ప్రభుత్వం విధించిన కొత్త నిబంధనలను పాటించనున్నట్లు ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఫ్రాన్స్ ధృవీకరించింది. ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాలు లేని పాకిస్థాన్ సహా 31 దేశాలకు చెందిన పైలట్లు, క్యాబిన్ సిబ్బందిని తమ దేశంలోకి అనుమతించబోమని ఇజ్రాయెల్ స్పష్టం చేసింది. ఈ మేరకు ఎయిర్ ఫ్రాన్స్ తన సిబ్బందికి సమాచారం అందించింది. ఇటీవల ఫ్లైదుబాయ్ విమానంలో చోటుచేసుకున్న భద్రతా సంఘటనే ఈ కఠిన నిబంధనలకు దారితీసింది. సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానాన్ని ఒమన్‌కు చెందిన సహ పైలట్ హైజాక్ చేసేందుకు యత్నించిన విషయం తెలిసిందే. బెన్ గురియన్ విమానాశ్రయాన్ని ఢీకొట్టేందుకు ప్లాన్ చేశాడని, ఈ క్రమంలో భారత కెప్టెన్‌పై దాడి చేశాడని తెలిసింది. ఈ ఘటన జరిగిన మరుసటి రోజే ఇజ్రాయెల్ రవాణా మంత్రిత్వ శాఖ విదేశీ విమానయాన సంస్థలకు ఓ ఆదేశం జారీ చేసింది. పాకిస్థాన్, ఇరాన్, సౌదీ అరేబియా, అల్జీరియా, ట్యూనీషియా, ఒమన్ వంటి 31 ముస్లిం మెజారిటీ దేశాల జాతీయత లేదా ద్వంద్వ పౌరసత్వం ఉన్న సిబ్బందిని ఇజ్రాయెల్‌కు వచ్చే విమానాల్లో నియమించవద్దని స్పష్టం చేసింది.




## నిరసనల రోజు రైళ్లు ఆపలేదు: ఢిల్లీ మెట్రో

న్యూఢిల్లీ: ప్రతిపక్షాలు, కాక్రోచ్ జనతా పార్టీ పిలుపునిచ్చిన నిరసనల నేపథ్యంలో అక్టోబర్ 10న రైళ్ల సేవలను రద్దు చేయలేదని, ఎలాంటి సేవలల్లో ఎలాంటి కోత విధించలేదని ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ) స్పష్టం చేసింది. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా కొన్ని మెట్రో స్టేషన్లను మూసివేసినప్పటికీ, మెట్రో కార్యకలాపాల పరిమాణంలో ఎలాంటి తగ్గింపు లేదని సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో వివరించింది. ఎన్డీటీవీకి లభించిన ఈ రిపై కాపీ ప్రకారం, అక్టోబర్ 10న స్టాండర్డ్ శనివారం షెడ్యూల్ ప్రకారమే 271 రైళ్లను సేవల్లోకి ప్రవేశపెట్టామని డీఎంఆర్‌సీ తెలిపింది. నెట్‌వర్క్ అంతటా పూర్తిస్థాయిలో 4,157 ట్రిప్పులు నడిపామని పేర్కొంది. మొత్తం 303 స్టేషన్లకు గాను, కేవలం 57 స్టేషన్లలో మాత్రమే ప్రయాణికుల ప్రవేశ, నిష్క్రమణలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు వివరించింది. అంటే, 85 శాతం నెట్‌వర్క్ యథావిధిగా పనిచేసిందని స్పష్టం చేసింది.

## నష్టాల్లో ముగిసిన మార్కెట్లు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం నష్టాలతో ముగిశాయి. ఫార్మా, హెల్త్‌కేర్ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి సూచీలను కిందకు లాగగా, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) షేర్లలో కొనుగోళ్ల మద్దతు నష్టాలను కొంతమేర పరిమితం చేసింది. వరుస లాభాల తర్వాత ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో మార్కెట్లు ఒడుదొడుకులకు లోనయ్యాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 251.89 పాయింట్లు (0.34%) నష్టపోయి 72,781.89 వద్ద స్థిరపడింది. అదేవిధంగా ఎన్ఎస్ఈ నిఫ్టీ 99.25 పాయింట్లు (0.44%) క్షీణించి 22,622.70 వద్ద ముగిసింది. నిఫ్టీ కీలకమైన 22,650 స్థాయికి దిగువన ముగియడం గమనార్హం. సెన్సెక్స్ 30 షేర్లలో ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, టీసీఎస్, హిందుస్థాన్ యూనిలీవర్, ఎన్టీపీసీ వంటివి ప్రధానంగా లాభపడ్డాయి. మరోవైపు, బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టపోయి సూచీపై ఒత్తిడి పెంచాయి. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, బజాజ్ ఫైనాన్స్ టాప్ లూజర్లుగా నిలిచాయి. రంగాల వారీగా చూస్తే.. నిఫ్టీ ఫార్మా, నిఫ్టీ హెల్త్‌కేర్ సూచీలు అత్యధికంగా నష్టపోయాయి. అయితే, నిఫ్టీ ఐటీ ఇండెక్స్ లాభాలతో ముగిసి మార్కెట్లకు కొంత అండగా నిలిచింది. ప్రధాన సూచీలతో పాటు బ్రాడర్ మార్కెట్లు కూడా బలహీనపడ్డాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.08%, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.32% మేర నష్టపోయాయి.



## వయ్యారి చిత్రం







## ఆర్సీ-17
# డెన్ రెడీ

### : సుకుమార్

ఇండస్ట్రీలో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్ మరోసారి పట్టాలెక్కడానికి సిద్ధమవుతోంది. ఆల్ టైమ్ బ్లాక్‌బస్టర్ 'రంగస్థలం' తర్వాత ఈ క్రేజీ కాంబో రిపీట్ అవుతుండటంతో భారీ హైప్ క్రియేట్ అయింది. '=జ 17' వర్కింగ్ టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమా పూజా కార్యక్రమాలకు సంబంధించిన ముహూర్తంపై గత కొంతకాలంగా రకరకాల పుకార్లు షికార్లు చేస్తూనే ఉన్నాయి. తాజాగా, ఈ ప్రచారాలకు తెరదించుతూ దర్శకుడు సుకుమార్ స్వయంగా ఈ విషయంపై అదిరిపోయే హింట్ ఇచ్చారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డెన్‌ను నేడు ఆయన అధికారికంగా ప్రారంభించారు. త్వరలోనే పూజా కార్యక్రమాలతో ఈ సినిమా అసలు ప్రయాణం మొదలవుతుందని ఆయన స్పష్టం చేశారు. అంతేకాకుండా, త్వరలోనే మోస్ట్ ఎగ్జైటింగ్ అప్‌డేట్స్ రాబోతున్నాయని, అందరూ వేచి చూడాలని ఫ్యాన్స్‌ని కోరారు.

# వేసవికి 'ఇండియన్-3'!




సినిమా నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎప్పుడూ రాజీపడని టాప్ డైరెక్టర్ శంకర్, మరోసారి తన గొప్ప మనసును చాటుకున్నారు. ప్రస్తుతం ఆయన తెరకెక్కిస్తున్న 'ఇండియన్ 3' మూవీ కోసం శంకర్ తన రెమ్యూనరేషన్‌ను సైతం పక్కనపెట్టడానికి సిద్ధమైనట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు చక్కర్లు కొడుతున్నాయి. లైకా ప్రొడక్షన్స్ సంస్థ ప్రస్తుతం ఆర్థిక పరమైన ఇబ్బందుల్లో ఉండటంతో.. శంకర్ తనకి రావాల్సిన బకాయిలను సినిమా విడుదలైన తర్వాత తీసుకోవాలని నిర్ణయించుకున్నారట. అయితే డెవలప్‌మెంట్, గ్రాఫిక్స్ విషయంలో మాత్రం ఎలాంటి రాజీ పడొద్దని ఆయన కండీషన్ పెట్టినట్లు తెలుస్తోంది. సినిమాలోని వీఎఫ్ఎక్స్, పోస్ట్ ప్రొడక్షన్ పనులన్నీ అత్యంత నాణ్యతతో రావాలని, దీనికోసం ఎంత సమయం పట్టినా ఫర్వాలేదని శంకర్ పట్టుబట్టినట్లు సమాచారం. లైకా సంస్థ కూడా ఆయన షరతుకు ఓకే చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో అనుకున్నట్లుగా 2027 సంక్రాంతికి 'ఇండియన్ 3' ప్రేక్షకుల ముందుకు రావడం కష్టమని తెలుస్తోంది. అయితే ఈ చిత్రాన్ని సమ్మర్ కానుకగా విడుదల చేయబోతున్నట్లు టాక్.

# నవంబర్ 27న 'హైందవ' రిలీజ్




టాలీవుడ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'హైందవ' విడుదల తేదీ ఖరారైంది. లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా నవంబర్ 27న థియేటర్లలోకి రానుంది. బుధవారం చిత్ర బృందం టీజర్‌ను విడుదల చేస్తూ ఈ విషయాన్ని ప్రకటించింది. మూన్‌షైన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో సంయుక్త కథానాయికగా నటిస్తున్నారు. టీజర్ చూస్తే సినిమా కథ రంగాపురం అనే గ్రామం చుట్టూ తిరుగుతుందని తెలుస్తోంది. అక్కడి పురాతన ఆలయంలో విగ్రహాలన్నీ ఒక్కసారిగా మాయమవుతాయి. అదే సమయంలో గ్రామంలో ఓ వ్యక్తి హత్యకు గురవుతాడు. దీంతో కథలో ఉత్కంఠ మొదలవుతుంది. ఆలయంలో మాయమైన విగ్రహాలు నిర్ణీత సమయంలో తిరిగి వస్తాయని ఆలయ పూజారి నమ్ముతాడు. మరోవైపు దేవుడి కన్నా మానవత్వాన్ని విశ్వసించే నాస్తికుడైన పోలీసు అధికారికి ఈ కేసు దర్యాప్తు బాధ్యతలు అప్పగిస్తారు. దీంతో విశ్వాసం, హేతుబద్ధమైన ఆలోచనల మధ్య సంఘర్షణతో పాటు అంతుచిక్కని పరిణామాలు కథలో ఆసక్తిని పెంచనున్నాయి.

## 400 కుటుంబాలకు
# రష్మిక సాయం

నటి రష్మిక మందన్న మరోసారి తన మంచి మనసును చాటుకున్నారు. ఆపదలో ఉన్న 400 కుటుంబాలకు అండగా నిలిచేందుకు ముందుకొచ్చారు. మూడు నెలల పాటు ఆ కుటుంబాల నిత్యావసర సరుకుల ఖర్చును భరించనున్నట్లు ప్రకటించారు. తనలోని ఈ సేవాభావానికి 'రణబాలి' సినిమాలోని జయమ్మ పాత్రే స్ఫూర్తి అని వెల్లడించారు.




ఇప్పటివరకు తాను చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి బయటకు చెప్పలేదని రష్మిక తెలిపారు. అయితే తనను చూసి మరికొందరైనా సాయం చేసేందుకు ముందుకొస్తారనే ఉద్దేశంతో ఈ విషయాన్ని పంచుకున్నట్లు వివరించారు. ఒక్కోసారి 400 కుటుంబాలకు మూడు నెలల పాటు సాయం అందించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని వచ్చే ఏడాది పాటు కొనసాగిస్తానని వెల్లడించారు. నిత్యావసర సరకుల కోసం ఖర్చు చేసే డబ్బు ఆదా అయితే, కుటుంబాలు తమ భవిష్యత్తు కోసం ప్రణాళికలు వేసుకోవచ్చని రష్మిక ఆశాభావం వ్యక్తం చేశారు. చిన్న సాయం కూడా ఒకరి జీవితంలో మార్పు తీసుకురాగలదని పేర్కొన్నారు. పెద్ద మొత్తంలో సాయం చేయాల్సిన అవసరం లేదని, ప్రతి ఒక్కరూ తమకు వీలైనంతలో చిన్న అడుగుతో ప్రారంభించాలని పిలుపునిచ్చారు.



## భిన్నమైన రోల్సే నా లక్ష్యం


'లెనిన్' సినిమాతో భారీ విజయాన్ని సాధించిన యంగ్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే.. వరుస చాన్స్‌లతో జోరుమీదున్నారు. 'ఆపరేషన్ గంగా' అనే యాక్షన్ సినిమాతో మలయాళ చిత్ర పరిశ్రమలోకి కూడా అడుగుపెట్టబోతున్న ఈ భామ తాజాగా, ఓ ఇంటర్వ్యూలో సినిమాల ఎంపిక గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. మనం చేసే సినిమాలను ఎలా ఎంచుకుంటాం, మనల్ని మనం ప్రేక్షకులకు ఎలా చూపించుకుంటాం అనే దానిపైనే మనకు వచ్చే పాత్రలు ఆధారపడి ఉంటాయని భాగ్యశ్రీ చెప్పారు. తాను ఇప్పటివరకు 'కాంత, లెనిన్, కింగ్‌డమ్ వంటి సినిమాల్లో విభిన్న పాత్రలతో అలరించానని తెలిపారు. ఇప్పుడు నటిగా తన లక్ష్యం అన్ని రకాల పాత్రలను వెతకడం, ప్రతి సినిమాలోనూ మరింత బాగా నటించడం అని చెప్పారు.




## రణబాలికి
## యూ/ఏ సర్టిఫికెట్

యువ హీరో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటించిన చిత్రం 'రణబాలి' విడుదలకు సిద్ధమైంది. తాజాగా ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్' నుంచి 'యూ/ఏ' సర్టిఫికెట్‌ను పొందింది. ఈ చిత్రాన్ని అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేయనున్నట్లు నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా నిర్మాణ సంస్థ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేస్తూ, "తరతరాలుగా నిలిచిన కథ. మనం తప్పక చూడాల్సిన ఒక లెజెండ్. మన చరిత్రను సరిదిద్దే ఈ గొప్ప అనుభూతిలో అక్టోబర్ 16న పాలుపంచుకోండి" అంటూ రాసుకొచ్చింది. ఈ ప్రకటనతో సినిమాపై ఉన్న అంచనాలు మరింత పెరిగాయి. దర్శకుడు రాహుల్ సాంకృత్యన్ ఈ చిత్రాన్ని పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా, బ్రిటిష్ కాలంనాటి నేపథ్యంలో తెరకెక్కించారు. 1854-1878 మధ్య కాలంలో జరిగిన, చరిత్ర పుస్తకాల్లో చోటు దక్కని కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమాను రూపొందించారు. బ్రిటిష్ పాలకులు చరిత్రలో తప్పుగా ప్రచారం చేసిన కొన్ని ఘటనలను ఈ సినిమా ద్వారా వెలుగులోకి తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఇది బయోపిక్ కాదని, అణచివేతకు గురైన చారిత్రక రికార్డులు, మౌఖిక కథనాల ఆధారంగా ఆ కాలాన్ని వెండితెరపై పునర్నిర్మించే ప్రయత్నమని చిత్ర వర్గాలు చెబుతున్నాయి.

# ఆ కోరిక ఉంది.. కానీ



ప్రముఖ నటి శోభితా ధూళిపాళ తన వ్యక్తిగత జీవితం, మాతృత్వంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు ఎప్పటినుంచో ఒక కుటుంబాన్ని ప్రారంభించాలని కోరిక ఉందని, అయితే అలాంటివి జరగాల్సిన సమయంలో వాటంతట అవే జరుగుతాయని ఆమె అన్నారు. గతేడాది డిసెంబర్‌లో టాలీవుడ్ నటుడు నాగచైతన్యను వివాహం చేసుకున్న శోభిత, పెళ్లి తర్వాత తొలిసారి ఫ్యామిలీ ప్లానింగ్‌పై స్పందించారు. ఇటీవల 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ విషయాలు పంచుకున్నారు. "నాకు ఎప్పటినుంచో ఒక కుటుంబం కావాలని ఉంది. కానీ దాని గురించి ఎక్కువగా ఆలోచించి ఒత్తిడి పెంచుకోను. ఎందుకంటే కొన్ని విషయాలు జరగాల్సిన సమయంలో వాటంతట అవే జరుగుతాయి" అని శోభిత వివరించారు. తన తొలి చిత్రం 'రామన్ రాఘవ్ 2.0'తో పరిశ్రమలోకి అడుగుపెట్టి పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆమె తన కెరీర్, వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడారు. గతంలో తాను నటులను ఎప్పటికీ డేట్ చేయనని చెప్పిన విషయాన్ని కూడా శోభిత గుర్తుచేసుకున్నారు.



## వైభవ్ ఆత్మవిశ్వాసం దెబ్బతీశారు: కృష్ణమాచారి శ్రీకాంత్

భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి వరుస అవకాశాలు ఇవ్వకుండా టీమ్ మేనేజ్‌మెంట్ అతడి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసిందని 1983 ప్రపంచకప్ విజేత కృష్ణమాచారి శ్రీకాంత్ విమర్శించాడు. ఆటగాళ్లను పదే పదే మార్చడం సరికాదని అభిప్రాయపడ్డాడు. వెస్టిండీస్‌తో జరిగే మ్యాచ్‌లో అభిషేక్ శర్మకు విశ్రాంతినిచ్చి, వైభవ్ సూర్యవంశీ, సంజు శాంసన్‌లను ఓపెనర్లుగా ఆడించాలని సూచించాడు. భారత టీ20 జట్టులో ఓపెనింగ్ స్థానాల కోసం అభిషేక్ శర్మ, సంజు శాంసన్, వైభవ్ సూర్యవంశీ మధ్య పోటీ నెలకొంది. అభిషేక్‌కు వరుసగా అవకాశాలు దక్కుతుండగా.. మిగతా ఆటగాళ్ల విషయంలో టీమ్ మేనేజ్‌మెంట్ మార్పులు చేస్తోంది. ఈ ధోరణి ఆటగాళ్ల ఆత్మవిశ్వాసంపై ప్రభావం చూపుతోందని శ్రీకాంత్ అభిప్రాయపడ్డాడు. జూన్-జులైలో ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలకు వైభవ్ ఎంపికయ్యాడు. తొలుత సంజు శాంసన్‌కు అవకాశాలు దక్కాయి. అయితే, ఐర్లాండ్‌తో పాటు ఇంగ్లాండ్‌తో తొలి టీ20లోనూ అతడు ఆశించిన స్థాయిలో రాణించలేదు. ఆ తర్వాత రెండో టీ20లో వైభవ్ అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. ఆ సిరీస్‌లో మూడు మ్యాచ్‌లు ఆడి 14, 13, 15 పరుగులు సాధించాడు. అనంతరం జింబాబ్వే పర్యటనలో 50, 20, 81 పరుగులతో మెరిశాడు. వైభవ్ ఆత్మవిశ్వాసాన్ని భారత జట్టు పూర్తిగా దెబ్బతీసిందని శ్రీకాంత్ వ్యాఖ్యానించాడు. వెస్టిండీస్ లాంటి జట్టుతో జరిగే మ్యాచ్‌లో అతడికి అవకాశం ఇవ్వాలని సూచించాడు. అభిషేక్ శర్మకు విశ్రాంతినిచ్చి, వైభవ్, సంజు శాంసన్‌లను ఓపెనర్లుగా ఆడించవచ్చని పేర్కొన్నాడు. సంజు శాంసన్ ప్రదర్శనలో నిలకడ కొరవడుతోందని శ్రీకాంత్ అన్నాడు. 2026 టీ20 ప్రపంచకప్ విజయంలో కీలక ఇన్నింగ్స్‌లు ఆడిన అతడు, ఆ తర్వాత మళ్లీ ఫామ్ కోల్పోయాడని పేర్కొన్నాడు. అభిషేక్ శర్మ ఆటలో ఇలాంటి తీవ్ర హెచ్చుతగ్గులు కనిపించవని వ్యాఖ్యానించాడు.

## ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారత బ్యాటర్ల హవా

**శ్రేయస్ అయ్యర్‌కు కెరీర్ బెస్ట్ ర్యాంక్**



భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో తన కెరీర్‌లోనే అత్యుత్తమ ర్యాంకును అందుకున్నాడు. వెస్టిండీస్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో అద్భుత ప్రదర్శన చేసిన అయ్యర్, మూడు స్థానాలు ఎగబాకి నాలుగో ర్యాంకును కైవసం చేసుకున్నాడు. లక్నో వేదికగా జరిగిన సిరీస్‌లోని తొలి మ్యాచ్‌లో తన తొలి టీ20 అంతర్జాతీయ శతకాన్ని నమోదు చేయడం అతడి ర్యాంకు భారీగా పెరగడానికి కారణమైంది. అయ్యర్ రాకతో టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో టాప్-4లో ముగ్గురు భారత ఆటగాళ్లు చోటు దక్కించుకోవడం విశేషం. ఇషాన్ కిషన్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా, అభిషేక్ శర్మ రెండో స్థానంలో ఉన్నాడు. పాకిస్థాన్ కెప్టెన్ సాహిబ్జాదా ఫర్హాన్ మూడో స్థానంలో నిలిచాడు. ఇదే సిరీస్‌లో రాణించిన మరో భారత ఆటగాడు సంజూ శామ్సన్ కూడా నాలుగు స్థానాలు మెరుగుపరుచుకుని 27వ ర్యాంకుకు చేరుకున్నాడు. ఇక బౌలింగ్ విషయానికి వస్తే.. భారత్‌తో సిరీస్‌లో రాణించిన వెస్టిండీస్ ఆటగాడు రోస్టన్ చేజ్ 24 స్థానాలు ఎగబాకి 23వ ర్యాంకులో నిలిచాడు. ఆల్‌రౌండర్ల జాబితాలోనూ రెండు స్థానాలు మెరుగుపరుచుకుని మూడో స్థానానికి చేరుకున్నాడు. పాకిస్థాన్ బౌలర్ సల్మాన్ మీర్జా 14వ స్థానానికి, సయీం అయూబ్ 54వ స్థానానికి మెరుగుపడ్డారు.

**టెస్టుల్లోనూ కీలక మార్పులు**

దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 214 పరుగుల తేడాతో విజయం సాధించడంతో టెస్టు ర్యాంకింగ్స్‌లోనూ పలు మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ మ్యాచ్‌లో 190, 82 పరుగులతో అద్భుత ప్రదర్శన చేసి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచిన ఆస్ట్రేలియా బ్యాటర్ మాథ్యూ రెన్షా, ఏకంగా టాప్-100 బయట నుంచి 49వ ర్యాంకుకు దూసుకొచ్చాడు. ఆసీస్ బౌలర్ జోష్ హేజిల్‌వుడ్ కెరీర్ బెస్ట్ గణాంకాలతో (6/49) రెండు స్థానాలు మెరుగుపరుచుకుని ఏడో ర్యాంకుకు చేరుకున్నాడు. మిచెల్ స్టార్క్ అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు. భారత స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా టెస్టు ఆల్‌రౌండర్ల జాబితాలో తన నంబర్ వన్ స్థానాన్ని పదిలంగా ఉంచుకున్నాడు. మరోవైపు, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్ మధ్య జరిగిన టెస్టులో రాణించిన రహ్మత్ షా 13వ ర్యాంకుకు, లిటన్ దాస్ 29వ ర్యాంకుకు చేరుకున్నారు.





# హోప్ విధ్వంసం

**రూథర్‌ఫోర్డ్ మెరుపులు.. చేతులెత్తేసిన టీమిండియా.. వెన్ను విరిచిన కీమో పాల్**

భారీ లక్ష్యం.. ఆరంభంలో దూకుడు.. మధ్యలో కీలక వికెట్ల పతనం.. చివర్లో కీమో పాల్ విజృంభణ! ఇలా ఎన్నో మలుపుల మధ్య సాగిన నాలుగో టీ20లో భారత్‌కు ఓటమి తప్పలేదు. తొలుత షాయ్ హోప్ శతకంతో విరుచుకుపడటంతో వెస్టిండీస్ 247 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో భారత బ్యాటర్లు పోరాడినా, కీలక సమయంలో వికెట్లు కోల్పోవడంతో విజయం అందలేదు.

**కీమో పాల్ నాలుగు ఓవర్లలో 41 పరుగులిచ్చి ఐదు వికెట్లు పడగొట్టి భారత బ్యాటింగ్ వెన్ను విరిచాడు. దీంతో ఐదు టీ20ల సిరీస్‌లో ఇరు జట్లు రెండేసి విజయాలు సాధించాయి. బెంగళూరులో శనివారం జరగనున్న ఐదో మ్యాచ్ సిరీస్ డిసైడర్ కానుంది. 248 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు సంజూ శాంసన్ అదిరిపోయే ఆరంభం ఇచ్చాడు.**



అతడు కేవలం 23 బంతుల్లో 56 పరుగులు చేశాడు. ఆరు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో విండీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. వేగంగా పరుగులు సాధిస్తూ భారత్ విజయంపై ఆశలు రేపాడు. అయితే కీమో పాల్ వేసిన ఓవర్‌లో శాంసన్ క్యాచ్ ఇచ్చి వెనుదిరగడంతో భారత్‌కు తొలి ఎదురుదెబ్బ తగిలింది. ఇదే ఓవర్‌లో ఇషాన్ కిషన్ కూడా ఔటయ్యాడు. మూడు బంతులు ఎదుర్కొన్న అతడు ఆరు పరుగులే చేసి కీమో పాల్ బౌలింగ్‌లో జువెల్ ఆండ్రూకు క్యాచ్ ఇచ్చాడు. దూకుడుగా ఆడాల్సిన సమయంలో ఇషాన్ త్వరగా వెనుదిరగడం భారత్‌పై ఒత్తిడి పెంచింది. అభిషేక్ శర్మ 24 బంతుల్లో 29 పరుగులు చేశాడు. మూడు ఫోర్లు, ఒక సిక్సర్ బాదిన అతడిని గుడాకేశ్ మోటీ పెవిలియన్‌కు పంపాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 11 బంతుల్లో 16 పరుగులు చేసి శమర్ స్ప్రింగర్ బౌలింగ్‌లో జువెల్ ఆండ్రూకు క్యాచ్ ఇచ్చాడు. దీంతో భారత్ కీలక వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో పడింది. మధ్య ఓవర్లలో తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి భారత ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టేందుకు ప్రయత్నించారు. తిలక్ దూకుడుగా ఆడుతూ సిక్సర్లతో స్కోరు వేగాన్ని పెంచాడు. అతడు 25 బంతుల్లో 45 పరుగులు చేశాడు. కానీ, షెపర్డ్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడే క్రమంలో పావెల్‌కు క్యాచ్ రూపంలో దొరికిపోయాడు. నితీశ్ కుమార్ రెడ్డి కూడా కీలక సమయంలో వేగంగా పరుగులు సాధించాడు. అతడు 20 బంతుల్లో 41 పరుగులు చేసి తిలక్ వర్మ తరహాలోనే భారీ షాట్ ఆడే ప్రయత్నం చేసి పావెల్‌కు క్యాచ్ ఇచ్చాడు. భారీ లక్ష్యాన్ని ఛేదించాలంటే చివరి ఓవర్లలో పరుగుల వేగం పెంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో భారత బ్యాటర్లపై ఒత్తిడి పెరిగింది. భారీ షాట్లు ఆడే ప్రయత్నంలో వికెట్లు కోల్పోవడంతో విజయావకాశాలు దెబ్బతిన్నాయి. చివరి ఓవర్లలో కీమో పాల్ భారత బ్యాటర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. వరుసగా వికెట్లు తీస్తూ ఛేదనను విండీస్ వైపు తిప్పాడు. నాలుగు ఓవర్లు వేసి 41 పరుగులిచ్చి ఐదు వికెట్లు పడగొట్టాడు. లక్ష్యం అందుకోవడం కష్టంగా మారడంతో భారత బ్యాటర్లు భారీ షాట్లు ఆడేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో క్యాచ్‌ల రూపంలో వికెట్లు సమర్పించుకున్నారు. చివరకు అర్ష్‌దీప్ సింగ్ రిటైర్డ్ హర్ట్ కావడంతో భారత్ ఇన్నింగ్స్ ముందుగానే ముగిసింది. భారత్ 19.3 ఓవర్లలో 223 పరుగులు చేసింది. భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో భారత బ్యాటర్లు చివరి వరకు పోరాడినా, కీమో పాల్ బౌలింగ్ ముందు నిలవలేకపోయారు. అంతకుముందు టాస్ గెలిచిన భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. అయితే వెస్టిండీస్ బ్యాటర్లు భారత బౌలర్లపై విరుచుకుపడ్డారు. కెప్టెన్ షాయ్ హోప్ 50 బంతుల్లో 102 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అతడి ఇన్నింగ్స్‌లో నాలుగు ఫోర్లు, తొమ్మిది సిక్సర్లు ఉన్నాయి. ఆరంభం నుంచి చివరి వరకు దూకుడుగా ఆడుతూ భారత బౌలర్లకు కష్టాలు తెచ్చిపెట్టాడు. జువెల్ ఆండ్రూ 16 బంతుల్లో 21 పరుగులు చేసి జట్టుకు మంచి ఆరంభం ఇచ్చాడు. అతడిని అక్షర్ పటేల్ ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన షిమ్రోన్ హెట్‌మైర్ కేవలం 12 బంతుల్లో 33 పరుగులు చేశాడు. నాలుగు ఫోర్లు, రెండు సిక్సర్లతో భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. అతడిని ప్రిన్స్ యాదవ్ క్యాచ్ అండ్ బౌల్డ్‌గా ఔట్ చేశాడు. రోవ్‌మన్ పావెల్ 17 బంతుల్లో 24 పరుగులు చేశాడు. అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌లో సంజూ శాంసన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. మరోవైపు షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్ 26 బంతుల్లో 49 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. హోప్‌తో కలిసి చివరి ఓవర్లలో వేగంగా పరుగులు సాధించాడు. దీంతో వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో మూడు వికెట్లకు 247 పరుగులు చేసింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, అక్షర్ పటేల్ తలో వికెట్ తీశారు. మయాంక్ యాదవ్ నాలుగు ఓవర్లలో 52 పరుగులు ఇవ్వగా, అర్ష్‌దీప్ కూడా 52 పరుగులు సమర్పించుకున్నాడు. భారీ స్కోరును కాపాడుకోవడంలో విండీస్ బౌలర్లు విజయవంతమయ్యారు.

## నటరాజన్ తిరిగి హైదరాబాద్‌కు!



ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందే సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య కీలక ఆటగాళ్ల ట్రేడ్ జరిగింది. భారత ఎడమచేతి పేసర్ టీ.నటరాజన్ తిరిగి సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులోకి రానుండగా.. లెగ్ స్పిన్నర్ జీషన్ అన్సారీ ఢిల్లీ క్యాపిటల్స్‌కు మారనున్నాడు. ఈ విషయాన్ని ఐపీఎల్ అధికారికంగా ప్రకటించింది. నటరాజన్ 2020 నుంచి 2024 వరకు సన్‌రైజర్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఇప్పుడు రూ.5 కోట్ల ధరతో తిరిగి హైదరాబాద్ జట్టులో చేరనున్నాడు. 2025 మెగా వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ అతడిని రూ.10.75 కోట్లకు కొనుగోలు చేసింది. అయితే గాయం కారణంగా ఆ సీజన్‌లో తొలి 10 మ్యాచ్‌లకు దూరమైన నటరాజన్.. మే 5న సన్‌రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ తరఫున అరంగేట్రం చేశాడు. 2025 సీజన్‌లో రెండు మ్యాచ్‌లే ఆడాడు. 2026 సీజన్‌లో 10 మ్యాచ్‌ల్లో ఐదు వికెట్లు తీశాడు. నటరాజన్‌కు ఐపీఎల్ 2024 సీజన్ అత్యంత విజయవంతమైంది. ఆ ఏడాది 19 వికెట్లు తీసి సన్‌రైజర్స్ తరఫున అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్‌గా నిలిచాడు. ఆ సీజన్‌లో హైదరాబాద్ జట్టు ఫైనల్‌కు చేరడంలో కీలక పాత్ర పోషించాడు. ఇప్పటివరకు ఐపీఎల్‌లో 73 మ్యాచ్‌లు ఆడి 72 వికెట్లు పడగొట్టాడు. డెత్ ఓవర్లలో యార్కర్లు వేయడంలో పేరున్న నటరాజన్ రాకతో సన్‌రైజర్స్ పేస్ విభాగానికి మరింత బలం చేకూరనుంది. కెప్టెన్ పాట్ కమిన్స్‌తో పాటు యువ పేసర్లు ప్రఫుల్ హింగే, సకీబ్ హుస్సేన్, శ్రీలంక బౌలర్ ఇషాన్ మలింగ జట్టులో ఉన్నారు. మరోవైపు జీషన్ అన్సారీ రూ.40 లక్షల ధరతో ఢిల్లీ క్యాపిటల్స్‌లో చేరనున్నాడు. 2025 సీజన్‌లో సన్‌రైజర్స్ తరఫున 10 మ్యాచ్‌లు ఆడిన అతడికి 2026లో ఒక్క మ్యాచ్‌లోనూ ఆడే అవకాశం రాలేదు.

## శతాబ్దపు టాప్-10 బౌలర్లు.. వార్న్, అండర్సన్, బూమ్రా




టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బూమ్రాకు అరుదైన గౌరవం దక్కింది. 21వ శతాబ్దంలో అత్యుత్తమ బౌలర్లలో మూడో స్థానంలో నిలిచి, తన సత్తాను మరోసారి ప్రపంచానికి చాటాడు. ఇంగ్లండ్ ప్రస్తుత ఆటగాడు జాస్ బట్లర్, మాజీ పేసర్ స్టువర్ట్ బ్రాడ్ కలిసి రూపొందించిన టాప్-10 బౌలర్ల జాబితాలో బూమ్రా ఈ అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. తమ 'ఫర్ ది లవ్ ఆఫ్ క్రికెట్' అనే పాడ్‌కాస్ట్ కార్యక్రమంలో వారు ఈ జాబితాను విడుదల చేశారు. బట్లర్, బ్రాడ్ జాబితాలో ఆస్ట్రేలియా దివంగత లెగ్ స్పిన్ దిగ్గజం షేన్ వార్న్ అగ్రస్థానంలో నిలవగా, ఇంగ్లండ్ పేస్ గుర్రం జేమ్స్ అండర్సన్ రెండో స్థానాన్ని దక్కించుకున్నాడు. వారి తర్వాత మూడో స్థానంలో బూమ్రాకు చోటివ్వడం విశేషం. ఈ క్రమంలో బూమ్రా.. ఆస్ట్రేలియాకు చెందిన గ్లెన్ మెక్‌గ్రాత్ (4వ స్థానం), శ్రీలంక స్పిన్ మాంత్రికుడు ముత్తయ్య మురళీధరన్ (6వ స్థానం), దక్షిణాఫ్రికా పేస్ తుఫాన్ డేల్ స్టెయిన్ (7వ స్థానం) వంటి దిగ్గజాలను వెనక్కి నెట్టాడు. ఈ జాబితాలో ఆస్ట్రేలియా ప్రస్తుత కెప్టెన్ పాట్ కమిన్స్ ఐదో స్థానంలో నిలిచాడు. దక్షిణాఫ్రికాకు చెందిన డేల్ స్టెయిన్, కగిసో రబడ, షాన్ పొలాక్ వరుసగా 7, 8, 9 స్థానాల్లో ఉండగా, ఆసీస్ పేసర్ మిచెల్ స్టార్క్ పదో స్థానంతో జాబితాను పూర్తి చేశాడు.

ఈనాటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

# పాక్‌ను నమ్మిన సౌదీకి అవమానం!

అంతర్జాతీయ రాజకీయాల్లో నమ్మకం విలువైనది. ముఖ్యంగా రక్షణ, భద్రత వంటి కీలక అంశాల్లో దేశాల మధ్య కుదిరే ఒప్పందాలు కేవలం కాగితాలకే పరిమితం కాకూడదు. ఆపద వచ్చినప్పుడు అండగా నిలబడటమే నిజమైన మిత్రత్వానికి నిదర్శనం. కానీ నమ్మిన దేశమే అవసరమైన సమయంలో ఆశించిన స్థాయిలో తోడ్పడకపోతే పరిస్థితి ఏమిటి? నమ్మకంతో వేసిన అడుగులు నిరాశకు దారితీస్తే ఎదురయ్యే పరిణామాలేమిటి? పాకిస్థాన్‌ను నమ్మిన సౌదీ అరేబియా విషయంలో ఇప్పుడు ఇలాంటి ప్రశ్నలే ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. వ్యూహాత్మక భాగస్వామ్యమని భావించిన బంధం సౌదీకి ఆశించిన భరోసాను ఇవ్వలేకపోతే, అది ఆ దేశానికి దౌత్యపరమైన ఇబ్బందికర పరిస్థితిగా మారుతుంది. సౌదీ అరేబియా, పాకిస్థాన్ మధ్య సంబంధాలు చాలాకాలంగా కొనసాగుతున్నాయి. ఆర్థిక సహకారం, రక్షణ భాగస్వామ్యం, రాజకీయ సంబంధాలు ఈ బంధానికి పునాదులుగా ఉన్నాయి. పాకిస్థాన్‌కు సౌదీ అరేబియా కీలకమైన ఆర్థిక భాగస్వామి కాగా, సౌదీకి పాకిస్థాన్ ఒక ముఖ్యమైన రక్షణ భాగస్వామిగా ఉంది. ఇలాంటి నేపథ్యంలో పరస్పర విశ్వాసానికి అత్యంత ప్రాధాన్యం ఉంటుంది. అయితే, మైత్రి ఎంత బలంగా ఉందన్నది సాధారణ పరిస్థితుల్లో కాదు.. సంక్షోభ సమయాల్లోనే తేలుతుంది. దేశాల మధ్య ఒప్పందాలు కుదుర్చుకోవడం, ఉమ్మడి ప్రకటనలు చేయడం, పరస్పర సహకారానికి హామీలు ఇవ్వడం అంతర్జాతీయ దౌత్యంలో సాధారణమే. కానీ ఆ హామీలు ఆచరణలో ఎంతవరకు అమలవుతున్నాయన్నదే అసలు విషయం. ఒక దేశం మరో దేశాన్ని తన భద్రతా భాగస్వామిగా పరిగణించినప్పుడు, అవసరమైన సమయంలో ఆ భాగస్వామి నుంచి వచ్చే సహకారంపై అంచనాలు పెట్టుకోవడం సహజం. ఆ అంచనాలకు అనుగుణంగా పరిణామాలు లేకపోతే అసంతృప్తి ఏర్పడుతుంది. మిత్రదేశంపై పెట్టుకున్న నమ్మకమే ప్రశ్నార్థకమవుతుంది.



# కాంగ్రెస్ శ్రేణుల్లో భయం

**తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి పాలనాపరమైన సవాళ్లతోపాటు రాజకీయపరమైన ఒత్తిళ్లు కూడా ఎదురవుతున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ప్రజల పెరుగుతున్న అంచనాలు, గ్రామీణ ప్రాంతాల్లో నెలకొంటున్న సమస్యలు, స్థానిక నాయకులపై ప్రజల నుంచి వస్తున్న ప్రశ్నలు పార్టీ శ్రేణుల్లో ఆందోళనకు కారణమవుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారంలో ఉన్నామనే ధీమా ఒకవైపు.. ప్రజలకు ఏం సమాధానం చెప్పాలనే సందిగ్ధత మరోవైపు క్షేత్రస్థాయి నాయకులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయనే చర్చ సాగుతోంది. అయితే, కాంగ్రెస్ శ్రేణులన్నింటిలోనూ భయం నెలకొందని చెప్పడానికి సమగ్ర ఆధారాలు అవసరం. అయినప్పటికీ, ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం జరిగితే దాని రాజకీయ ప్రభావం తప్పదనేది స్పష్టం.**

రైతుల సమస్యలు, సాగునీటి కొరత, విద్యుత్ సరఫరాపై ఫిర్యాదులు, పంటలకు గిట్టుబాటు ధర, నిరుద్యోగుల ఆశలు, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, సంక్షేమ పథకాల అమలు.. ఇలా అనేక అంశాలపై ప్రజల్లో అంచనాలు ఉన్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలనే ఒత్తిడి ప్రభుత్వంపై ఉండటం సహజం. అయితే, హామీల అమలులో కనిపించే జాప్యం, లబ్ధిదారుల ఎంపికలో ఎదురయ్యే సమస్యలు, స్థానిక స్థాయిలో అధికార యంత్రాంగం స్పందించకపోవడం వంటి అంశాలు ప్రజల్లో అసంతృప్తికి దారితీయవచ్చు. ప్రజలకు ప్రభుత్వం అందుబాటులో ఉందా? తమ సమస్యలకు పరిష్కారం లభిస్తోందా? అనే ప్రశ్నలే పాలనకు గీటురాళ్లు. ప్రభుత్వ పథకాలపై ప్రచారం ఎంత విస్తృతంగా చేసినా, క్షేత్రస్థాయిలో ప్రజలకు ప్రయోజనం అందకపోతే ఆ ప్రచారం ఆశించిన ఫలితాలను ఇవ్వదు. ప్రజల సమస్యలు పరిష్కారం కాకపోతే అధికార పార్టీ నాయకులే ముందుగా ప్రజల ప్రశ్నలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎన్నికల సమయంలో పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలు, స్థానిక నాయకులు ప్రజలకు అనేక హామీలు ఇచ్చి ఉంటారు. అధికారంలోకి వచ్చిన తర్వాత తమ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతాయని, సమస్యలకు పరిష్కారం లభిస్తుందని వారు ఆశించి ఉంటారు. కానీ, ప్రజల అంచనాలకు అనుగుణంగా మార్పులు కనిపించకపోతే కార్యకర్తలు ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రజలకు సమాధానం చెప్పలేని పరిస్థితి ఏర్పడితే పార్టీపై వారి నిబద్ధతపైనా ప్రభావం పడే అవకాశం ఉంటుంది. అధికారంలో ఉన్న పార్టీకి ప్రజల నుంచి ప్రశ్నలు రావడం సహజం. వాటిని ప్రతిపక్షాల కుట్రగా కొట్టిపారేయడం కంటే, ఆ ప్రశ్నల్లోని వాస్తవాలను పరిశీలించడం ముఖ్యం. స్థానిక నాయకులు తమ సమస్యలను ఉన్నతస్థాయి నాయకత్వానికి చేరవేసే అవకాశం ఉండాలి. కార్యకర్తల అసంతృప్తిని అణచివేయడం ద్వారా కాకుండా, వారి సమస్యలను పరిష్కరించడం ద్వారా మాత్రమే పార్టీ వ్యవస్థను బలోపేతం చేయగలుగుతుంది.

**- రుద్ర ప్రవీణ్ చంద్ర, వరంగల్**



# టీడీపీ నీడలో జనసేన ఉనికి ఎక్కడ?

**ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలో ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో జనసేన నాయకుల పాత్ర, ప్రాధాన్యంపై చర్చ జరుగుతోంది. ముఖ్యంగా స్థానికంగా పార్టీ కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తల్లో తమకు తగిన గుర్తింపు లభించడం లేదనే అసంతృప్తి ఉందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండటం ఒక ఎత్తయితే, క్షేత్రస్థాయిలో పార్టీ ఉనికిని చాటుకోవడం మరో ఎత్తు. ఈ రెండింటి మధ్య అంతరం పెరిగితే జనసేనకు రాజకీయంగా సవాళ్లు తప్పవు.**

కూటమి ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ ప్రధాన పాత్ర పోషిస్తుండగా, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వంలో కీలక పదవి ఉండటం, పార్టీ శ్రేణులకు స్థానికంగా రాజకీయ ప్రాధాన్యం దక్కడం ఒకటి కాదనే విషయాన్ని గుర్తించాలి. అధికారంలో భాగస్వామిగా ఉన్నప్పటికీ, గ్రామాలు, మండలాలు, నియోజకవర్గాల స్థాయిలో తమ మాటకు విలువ ఉండటం లేదని జనసేన నాయకులు భావిస్తే, ఆ అసంతృప్తిని తేలికగా తీసుకోలేం. తెలుగుదేశం పార్టీకి దశాబ్దాల రాజకీయ అనుభవం, బలమైన సంస్థాగత నిర్మాణం, గ్రామస్థాయి వరకు విస్తరించిన నాయకత్వ వ్యవస్థ ఉన్నాయి. ప్రభుత్వ కార్యక్రమాలు, పార్టీ సమావేశాలు, స్థానిక రాజకీయ వ్యవహారాల్లో ఆ పార్టీ నాయకుల చురుకుదనం సహజంగానే ఎక్కువగా కనిపించవచ్చు. అయితే, ఈ క్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలకు తగిన అవకాశాలు లభిస్తున్నాయా? కూటమి నిర్ణయాల్లో వారికి భాగస్వామ్యం కల్పిస్తున్నారా? స్థానిక సమస్యల పరిష్కారంలో వారి సూచనలకు విలువ ఇస్తున్నారా? అన్న ప్రశ్నలకు సమాధానాలు అవసరం. కూటమి అంటే ఎన్నికల సమయంలో సీట్ల సర్దుబాటు మాత్రమే కాదు. అధికారంలోకి వచ్చిన తర్వాత పరస్పర గౌరవం, బాధ్యతల పంపిణీ, రాజకీయ భాగస్వామ్యం కూడా అంతే ముఖ్యం. ఒక పార్టీ నాయకులు ప్రభుత్వ విజయాలను తమ ఖాతాలో వేసుకుంటూ, మరో పార్టీ నాయకులు మాత్రం కార్యకర్తలకు సమాధానం చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడితే, అది కూటమి సమన్వయానికి సవాలుగా మారుతుంది. అయితే, రాష్ట్రవ్యాప్తంగా జనసేన నాయకులందరిలోనూ ఇదే అసంతృప్తి ఉందని నిర్ధారించలేం. కొన్ని ప్రాంతాల్లో వ్యక్తమవుతున్న అభిప్రాయాలను మొత్తం పార్టీ పరిస్థితికి వర్తింపజేయడం సరికాదు. అయినప్పటికీ, అలాంటి స్వరాలు వినిపిస్తున్నప్పుడు పార్టీ నాయకత్వం వాటి వెనుక ఉన్న కారణాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. జనసేనకు పవన్ కల్యాణ్ ప్రధాన రాజకీయ బలం. ఆయన వ్యక్తిగత ప్రజాదరణ, పార్టీ పట్ల అభిమానంతో పనిచేసే కార్యకర్తల నిబద్ధత జనసేనకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. అయితే, నాయకుడి ప్రజాదరణను స్థిరమైన రాజకీయ బలంగా మార్చాలంటే క్షేత్రస్థాయి నాయకత్వానికి అవకాశాలు కల్పించాలి. పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపు, బాధ్యతలు, ప్రజాసేవలో భాగస్వామ్యం దక్కేలా వ్యవస్థ ఉండాలి. ప్రభుత్వంలో జనసేనకు ఉన్న ప్రాతినిధ్యం ఎంత? ఆ ప్రాతినిధ్యం ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలేమిటి? స్థానిక సమస్యలపై పార్టీ నాయకులు ఎంతవరకు స్పందించగలుగుతున్నారు? కార్యకర్తలకు అందుబాటులో ఉండే నాయకత్వ వ్యవస్థ ఉందా? వంటి అంశాలపై పార్టీ అంతర్గతంగా సమీక్ష జరగాలి. కేవలం అగ్రనాయకుల మధ్య సత్సంబంధాలు ఉన్నాయనే కారణంతో క్షేత్రస్థాయి సమన్వయం సజావుగా ఉందని భావించడం పొరపాటు. జనసేన తన ప్రత్యేక రాజకీయ గుర్తింపును నిలబెట్టుకోవాలంటే కూటమి ధర్మాన్ని పాటిస్తూనే, ప్రజా సమస్యలపై స్వతంత్రంగా స్పందించే సామర్థ్యాన్ని పెంచుకోవాలి. కూటమి ప్రభుత్వంలో భాగంగా ఉన్నందున ప్రతి అంశంలో విభేదించడం పరిష్కారం కాదు. అదే సమయంలో, భాగస్వామ్య పార్టీగా ఉన్నందున ప్రతి అంశంలో మౌనం పాటించడం కూడా సరైన వ్యూహం కాదు. ప్రజలకు ఇచ్చిన హామీలు, స్థానిక సమస్యలు, ప్రభుత్వ సేవల అమలు వంటి విషయాలపై నిర్మాణాత్మకంగా స్పందించగలగాలి. గ్రామస్థాయిలో జనసేన నాయకులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించేందుకు పార్టీ ప్రత్యేక సమీక్షలు నిర్వహించాలి. నియోజకవర్గాల వారీగా సమన్వయ వ్యవస్థను బలోపేతం చేయాలి. కూటమి భాగస్వాముల మధ్య విభేదాలు ఉంటే వాటిని బహిరంగ విమర్శల స్థాయికి వెళ్లకముందే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి. అదే సమయంలో, పార్టీ శ్రేణుల అభిప్రాయాలను అగ్రనాయకత్వానికి చేరవేసే పారదర్శక వ్యవస్థను ఏర్పాటు చేయాలి. తెలుగుదేశం పార్టీ దూకుడు కనిపిస్తోందనే భావన జనసేన నాయకుల్లో ఉంటే, దానికి సమాధానం కేవలం ప్రకటనలతో రాదు. ప్రజల్లోకి వెళ్లడం, సమస్యలపై పోరాడటం, కార్యకర్తలకు అండగా నిలవడం, స్థానిక నాయకత్వాన్ని బలోపేతం చేయడం ద్వారానే పార్టీ తన ఉనికిని స్పష్టంగా చాటుకోగలదు. కూటమి కొనసాగడం రెండు పార్టీలకూ రాజకీయంగా ముఖ్యమే. కానీ, ఆ కూటమిలో ప్రతి భాగస్వామికీ గౌరవం, బాధ్యత, గుర్తింపు ఉండాలి. జనసేనకు అధికారంలో పదవులు ఉన్నాయా లేదా అన్నదానికంటే, ఆ పదవుల ద్వారా పార్టీ శ్రేణులకు ఎంత భరోసా లభిస్తోంది, ప్రజలకు ఎంత సేవ అందుతోంది అన్నదే అసలు కొలమానం. స్థానిక నాయకుల అసంతృప్తి నిజంగా పెరుగుతున్నట్లయితే, అది జనసేన నాయకత్వానికి ఒక హెచ్చరికగా భావించాలి. ఆ స్వరాలను నిర్లక్ష్యం చేయకుండా వినడం, సమస్యలను పరిష్కరించడం, కూటమిలో సమన్వయాన్ని మెరుగుపరచడం ద్వారానే జనసేన తన రాజకీయ ప్రాధాన్యాన్ని నిలబెట్టుకోగలదు.

**- దస్తూరి నారాయణరావు, గుంటూరు**

రచయితలకు ఆహ్వానం!
సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..
అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
ప్రజావాణి వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి ఈవార్తలు పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం, మీ బైలైన్‌తో..!
పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.